RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | గురువారం, సెప్టెంబరు 17, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 134 | పేజీలు: 8 | వెల : రూ.1



**పటేల్ సంకల్పం లేకుంటే తెలంగాణ భారత్‌లో కలిసేదా?**

ఎన్.రాంచందర్‌రావు

# భూ సమస్యల పరిష్కారానికి హైపవర్ కమిటీ

### 22-ఏ నిషేధిత జాబితాలోని నిరుపేదల ఆస్తులపై 30 రోజుల్లో నిర్ణయం

### శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన



హైదరాబాద్: రాష్ట్రంలో 22-ఏ నిషేధిత జాబితాలో ఉన్న నిరుపేదలకు సంబంధించిన ఆస్తుల సమస్యలపై 30 రోజుల్లోగా న్యాయం జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి శాసనసభ వేదికగా ప్రకటించారు. 22-ఏ నిషేధిత జాబితా వివాదాల పరిష్కారానికి సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఉన్నతాధికారితో కూడిన హైపవర్ ఆఫీసర్స్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 22-ఏ నిషేధిత జాబితాపై శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చకు సీఎం సుదీర్ఘంగా సమాధానం ఇచ్చారు. నిజాం కాలం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వరకు, అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు భూములకు సంబంధించి అమలైన చట్టాలు, వాటి చారిత్రక పరిణామ క్రమాన్ని సభకు వివరించారు. న్యాయమైన, చట్టబద్ధమైన అంశాల్లో నిరుపేదలకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రధానంగా గుర్తించిన 12 భూ సమస్యలపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) భూముల విషయంలో పాక్షికంగా క్రమబద్ధీకరించిన, క్రమబద్ధీకరించని కాలనీలతో పాటు యూఎల్‌సీ మిగులు భూముల క్రమబద్ధీకరణకు

(మిగతా 2వ పేజీలో)



# కౌలు రైతులకు రుణాలు అందించేలా బ్యాంకులు ముందుకు రావాలి

### బ్యాంకర్లకు, అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి: కౌలు రైతులకు సమృద్ధిగా రుణాలు అందించేలా బ్యాంకులు ముందుకు రావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. అన్ని రంగాలు, అన్ని వర్గాలు బలోపేతం అయ్యేలా బ్యాంకులు రుణాలు అందించాలని కోరారు. 236వ ఎస్-ఎల్‌బీసీ (స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ) సమావేశంలో వివిధ అంశాలపై బ్యాంకర్లు, అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని వివిధ రంగాల అభివృద్ధికి బ్యాంకులు మరింత విస్తృతంగా రుణ సదుపాయాలు కల్పించాలని సూచించారు.

**పీఎం సూర్యఘర్‌లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలి**

'పీఎం సూర్యఘర్' పథకం అమలులో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే

(మిగతా 2వ పేజీలో)



## తెలంగాణలో సెమీకండక్టర్ యూనిట్‌కు సింగపూర్ ఆసక్తి

### సీఎం రేవంత్‌రెడ్డితో అగస్టిన్ లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 16: తెలంగాణలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు సింగపూర్ ఆసక్తి వ్యక్తం చేసింది. సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ శాశ్వత కార్యదర్శి (ఇంధన, వాణిజ్య విభాగం) అగస్టిన్ లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డితో శాసనసభలో సమావేశమైంది. రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి అవకాశాలపై ఇరుపక్షాలు విస్తృతంగా చర్చించాయి. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూల పరిస్థితులు, ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను సీఎం రేవంత్‌రెడ్డి సింగపూర్ ప్రతినిధులకు వివరించారు. రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించడంతో పాటు పెట్టుబడులు పెట్టాలని కోరారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

**సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులకు ఆసక్తి**

రాష్ట్రంలో అత్యాధునిక మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని సీఎం తెలిపారు. ప్రపంచస్థాయి సెమీకండక్టర్ పరిశ్రమలకు అవసరమైన అనుమతులు, ప్రోత్సాహకాలు, ప్రభుత్వ సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలపై సింగపూర్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో సెమీకండక్టర్ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ప్రతినిధి బృందం తెలిపింది.

**మూసీ, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులపై వివరణ**

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలను సీఎం రేవంత్‌రెడ్డి సింగపూర్ బృందానికి వివరించారు. తొలిదశలో మూసా, ఈసా నదుల సంగమ ప్రాంతం నుంచి గాంధీ సరోవర్ వరకు మూసీ పునరుజ్జీవన పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

### సంగారెడ్డిలో గణేశ్ నిమజ్జనం వేళ

# ఆరుగురు విద్యార్థుల మృతి



**సంగారెడ్డి జిల్లాలో గణేశ నిమజ్జనంలో ఘోర విషాదం**

**చెరువులో మునిగి ఆరుగురు విద్యార్థులు దుర్మరణం**

**మృతులంతా శిరీష అనాథాశ్రమానికి చెందినవారే**

**మృతదేహాలను పరిశీలించి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సంతాపం**

**పటాన్‌చెరులో అలుముకున్న విషాద ఛాయలు**

వినాయక నిమజ్జన వేడుకల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని పెదకంజర్ల గ్రామ శివారులో ఉన్న నేరేడు చెరువులో మునిగి ఆరుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం ఒక్కసారిగా విషాదమయమైంది. మృతులంతా

(మిగతా 2వ పేజీలో)

## 'మరి హరీశ్‌రావు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?'.. పొంగులేటి

**అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై ప్రశ్నలు**

**పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై నకిలీ ఎన్‌ఓసీ ఆరోపణ**

**గంగుల కమలాకర్ భూములపైనా మంత్రి వ్యాఖ్యలు**

**22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములని వెల్లడి**

**47,440 ఎకరాలు తగ్గించినట్లు ప్రభుత్వం వెల్లడి**



హైదరాబాద్, సెప్టెంబర్ 16: మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతిచ్చినా అది తప్పేనని పేర్కొన్న ఆయన.. హరీశ్‌రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. "అప్పుడు మీ బుద్ధి ఎక్కడికి పోయింది?" అంటూ వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన పొంగులేటి.. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్‌ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని స్పష్టం చేశారు. ఈ విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్‌ఓసీతో

(మిగతా 2వ పేజీలో)



## బీఆర్ఎస్ భూములపై బీజేపీ దండయాత్ర

**ఆ భూముల్లో కాషాయ జెండాలు ఎగరేసి పేదలకు పంచుతాం: బండి సంజయ్**

**భూవివాదాల విచారణ పేరుతో బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ ఒప్పందం చేసుకుంటోందని ఆరోపణ**

కరీంనగర్, సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే): బీఆర్ఎస్ నేతలకు సంబంధించిన భూవివాదాలపై బీజేపీ ఆధ్వర్యంలో దండయాత్ర చేపడతామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. వివాదాస్పదంగా ఉన్న భూములు ప్రభుత్వ ఆధీనంలోకి వస్తే వాటిని పేదలకు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ భూవ్యవహారాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని బండి సంజయ్ ఆరోపించారు. కరీంనగర్ జిల్లాలో గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను కలెక్టర్, పోలీస్ కమిషనర్, నగర మేయర్, డిప్యూటీ మేయర్‌తో కలిసి బండి సంజయ్ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కరీంనగర్‌లో గణేశ్ నిమజ్జనోత్సవాల కోసం రూ.1.5 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గతేడాదితో పోలిస్తే

(మిగతా 2వ పేజీలో)



### నగర సమస్యలకు సమగ్ర పరిష్కారాలు

# అవసరం: కేటీఆర్

న్యూఢిల్లీ: నగరాల్లో నెలకొన్న సమస్యలకు తాత్కాలిక, హడావుడి నిర్ణయాలకంటే సమగ్ర పరిష్కారాలను అన్వేషించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రజలకు అనుకూలంగా భారతీయ నగరాలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు వినూత్న, సమ్మిళిత విధానాలను అవలంబించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మంగళవారం న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో జనాగ్రహ ఆధ్వర్యంలో నిర్వహించిన 'షెహెరాన్ పే చర్చా' కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. భారతీయ నగరాలను ప్రజలకు మరింత అనుకూలంగా ఎలా తీర్చిదిద్దాలనే అంశంపై వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులతో జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీలు మహువా మాజి, ఎస్. నిరంజన్‌రెడ్డి, జనాగ్రహ సీఈవో శ్రీకాంత్ విశ్వనాథన్‌తో కలిసి జరిగిన ప్యానెల్ చర్చలో కేటీఆర్ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో అమలు చేసిన విధానాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

**నగర ప్రభుత్వాలకు నిధుల సమీకరణే ప్రధాన సవాలు**

నగర ప్రభుత్వాలకు అవసరమైన మూలధనాన్ని సమకూర్చుకోవడం పెద్ద సవాలుగా మారిందని కేటీఆర్ అన్నారు. నగరాలను వేధిస్తున్న సమస్యలకు పరిష్కారం చూపేందుకు వినూత్న, అందరికీ అందుబాటులో ఉండే విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్‌పై పెరుగుతున్న భారాన్ని తగ్గించేందుకు అప్పటి కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన చర్యలను ఆయన వివరించారు. ప్రతి జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. అలాగే రెండో శ్రేణి నగరాల్లో (టియర్-2) ఐటీ టవర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

**హైస్పీడ్ రైళ్లతో నగరాలపై ఒత్తిడి తగ్గుతుందిలి**

పట్టణ రవాణా, ప్రజా రవాణా అంశాలపై కేటీఆర్ మాట్లాడుతూ.. హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తే పెద్ద నగరాలపై ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. వచ్చే దశాబ్దంలో ఈ దిశగా మరింత పురోగతి సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.కాగా, కార్యక్రమం జరిగిన ప్రాంగణంలోని 'భారత్ ఏఐ ఎక్స్‌పీరియెన్షియల్ సెంటర్'ను కేటీఆర్ సందర్శించారు. ప్రజా ప్రయోజనాల కోసం ఏఐ ఆధారిత పరిష్కారాలపై పనిచేస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులతో ఆయన మాట్లాడారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు

గురువారం, సెప్టెంబరు 17, 2026

# బీఆర్ఎస్ భూములపై బీజేపీ దండయాత్ర

మూడింతలు అధికంగా నిధులు కేటాయించామని చెప్పారు. అవసరమైన క్రేన్లు, విద్యుత్ దీపాలంకరణ, ఇతర ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను కోరారు. నిమజ్జనానికి మూడు రోజుల ముందే అవసరమైన నీటిని విడుదల చేయాలని సూచించారు. ప్రజల సెంటిమెంట్‌తో ఎవరూ ఆటలాడవద్దని, నిమజ్జనోత్సవాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. రహదారుల ప్యాచ్‌వర్క్ పూర్తయిందని, ఆధ్యాత్మిక వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

**'భూవ్యవహారాలపై గంటసేపు చర్చ'**

అసెంబ్లీలో ముఖ్యమంత్రి చేసిన భూములపై వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించాయని బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేల భూవ్యవహారాలపై మాట్లాడటానికే గంట సమయం పట్టిందని, మిగిలిన ఎమ్మెల్యేలపై చర్చించాలంటే అసెంబ్లీని ఎన్ని రోజులు నిర్వహించాలని ప్రశ్నించారు. తెలంగాణలో పెద్ద సంఖ్యలో కుటుంబాలకు సొంత భూమి, ఇళ్ల స్థలాలు లేవని, మరోవైపు కొందరు రాజకీయ నాయకుల వద్ద పెద్దఎత్తున భూములు ఉన్నాయనే ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. ఈ అంశాలపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

**'33 నెలలు ఎందుకు పట్టింది?'**

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు సంబంధించిన భూములపై ప్రభుత్వ భూమి ఉందనే విషయం తేల్చేందుకు 33 నెలలు ఎందుకు పట్టిందని బండి సంజయ్ ప్రశ్నించారు. వేల ఎకరాల భూములకు సంబంధించిన ఆరోపణలు ఉంటే వాటిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. భూముల వ్యవహారాలపై విచారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలు, సిట్‌ల పరిస్థితిపై కూడా ఆయన ప్రశ్నలు సంధించారు. జిల్లాల కలెక్టర్లకు పూర్తి అధికారాలు ఇస్తే తక్కువ సమయంలోనే భూములపై నివేదికలు సిద్ధం చేయవచ్చని పేర్కొన్నారు. 30 రోజుల గడువు పేరుతో విచారణను సాగదీస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని ఆరోపించారు. విద్యుత్ కొనుగోళ్లు, ఫార్ములా రేసు, కాళేశ్వరం, గొర్రెల పంపిణీ తదితర అంశాలపై గతంలో నమోదైన ఆరోపణల విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలను కూడా స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అటవీ భూముల ఆక్రమణలపైనా సమగ్ర విచారణ జరపాలని కోరారు.

**'బీఆర్ఎస్‌తో బేరసారాల కోసమేనా?'**

అసెంబ్లీలో బీఆర్ఎస్ భూవ్యవహారాలను ప్రస్తావించడం వెనుక రాజకీయ బేరసారాల ఉద్దేశం ఉందని బండి సంజయ్ ఆరోపించారు. ఏఐసీసీకి చెల్లించాల్సిన రాజకీయ 'ఈఎంఐ' గడువు దగ్గరపడటంతోనే బీఆర్ఎస్ భూముల చిట్టాను ప్రభుత్వం బయటకు తీస్తోందని వ్యాఖ్యానించారు. యూపీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య రాజకీయ అవగాహన కుదిరే అవకాశం ఉందని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి సంబంధిత పార్టీల నుంచి స్పష్టమైన వివరణ రావాల్సి ఉందని పేర్కొంటూ.. భూముల వ్యవహారాలపై ఆధారాలతో కూడిన పూర్తి వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

**'త్వరలో దండయాత్ర'**

బీఆర్ఎస్ నేతలకు సంబంధించిన భూవివాదాలపై బీజేపీ ఆధ్వర్యంలో త్వరలోనే దండయాత్ర చేపడతామని బండి సంజయ్ ప్రకటించారు. చట్టపరంగా ప్రభుత్వానికి చెందే భూములు గుర్తిస్తే వాటిని స్వాధీనం చేసుకుని పేదలకు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ అవగాహన ఉందన్న ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. భూముల అంశంపై ప్రభుత్వం పారదర్శకంగా విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు.

# పటేల్ సంకల్పం లేకుంటే తెలంగాణ భారత్‌లో కలిసేదా?

### నిజాం లొంగుబాటుకు సర్దార్ పటేల్ తెగువే కారణం

### చరిత్ర పునాదులపైనే ఉజ్వల భవిష్యత్తు.. భావితరాలకు పోరాట వీరుల త్యాగాలు తెలియాలి: ఎన్.రాంచందర్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 16:లిలి ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చూపిన తెగువ, సంకల్పం లేకుంటే తెలంగాణ నేడు భారత యూనియన్‌లో ఉండేది కాదని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. భావితరాలకు స్వాతంత్ర్య, విమోచన పోరాట వీరుల త్యాగాలు, చారిత్రక ఘట్టాలను తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన చారిత్రక ఫొటో ఎగ్జిబిషన్‌ను రాంచందర్‌రావు ముఖ్య అతిథిగా సందర్శించారు. విద్యార్థులతో కలిసి ప్రదర్శనను వీక్షించిన ఆయన.. నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాట ఘట్టాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశమంతటికీ 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం లభించినప్పటికీ హైదరాబాద్ సంస్థానానికి 1948 సెప్టెంబర్ 17న విముక్తి లభించిందని గుర్తుచేశారు. భారతదేశంలో



విలీనం కావడానికి నిరాకరించిన నిజాం నవాబుపై సర్దార్ పటేల్ ఆధ్వర్యంలో 'ఆపరేషన్ పోలో' చేపట్టడంతో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని తెలిపారు. ఈ చారిత్రక పరిణామాలకు సంబంధించిన ఘట్టాలను ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా విద్యార్థులకు తెలియజేస్తున్నామని చెప్పారు.

**పోరాట వీరుల త్యాగాలను స్మరించుకోవాలి**

భగత్‌సింగ్, ఝాన్సీ లక్ష్మీబాయి పేర్లు వింటే యువతలో దేశభక్తి ఉప్పొంగుతుందని, అదే స్థాయిలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ధైర్యం, త్యాగాలను కూడా భావితరాలు స్మరించుకోవాలని రాంచందర్‌రావు అన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా కొమురం భీం, రాంజీ గోండు, వందేమాతరం రామచంద్రరావు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తదితరులు పోరాటం సాగించారని గుర్తుచేశారు. నాటి పోరాట యోధులకు స్ఫూర్తినిచ్చిన 'వందేమాతరం' నినాదాన్ని నేటి విద్యార్థులు కూడా నేర్చుకుని గర్వంగా ఆలపించాలని పిలుపునిచ్చారు. చరిత్ర పునాదులపైనే భవిష్యత్తు నిర్మితమవుతుందని ఆయన అన్నారు. తెలంగాణలో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం, సెప్టెంబర్ 17న విమోచన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసి అమరవీరులకు నివాళులర్పిస్తున్నామని తెలిపారు.

**మోదీ జన్మదినం సందర్భంగా దీపాలు వెలిగించాలి**

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17న ప్రజలు తమ ఇళ్ల ముందు దీపాలు వెలిగించాలని రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ, 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు.

# అక్టోబర్ 10 నుంచి తెలంగాణలో దసరా సెలవులు




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులకు విద్యాశాఖ కీలక ప్రకటన చేసింది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు నిర్వహించనున్న సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షల షెడ్యూల్‌తో పాటు దసరా సెలవుల తేదీలను వెల్లడించింది. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సమ్మేటివ్--1 పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలు పూర్తయిన అనంతరం అక్టోబర్ 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులు కొనసాగనున్నాయి. దీంతో విద్యార్థులకు వరుసగా సెలవులు లభించనున్నాయి. సమ్మేటివ్-1 పరీక్షలను పాఠశాలల్లో సజావుగా నిర్వహించేందుకు విద్యాశాఖ తరగతుల వారీగా పరీక్షల సమయాలను కూడా ఖరారు చేసింది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 6వ తరగతి, 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయి. 7వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు నిర్వహించేలా సమయాన్ని కేటాయించారు. 9వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. తరగతుల సంఖ్య, విద్యార్థుల సంఖ్య, పాఠశాలల్లో అందుబాటులో ఉన్న వసతులను దృష్టిలో ఉంచుకుని పరీక్షల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా వేర్వేరు సమయాలను నిర్ణయించినట్లు విద్యాశాఖ వెల్లడించింది. సమ్మేటివ్--1 పరీక్షల్లో భాగంగా ఆయా తరగతులకు సంబంధించిన ప్రతి సబ్జెక్టుకు పరీక్ష తేదీలను కూడా ఖరారు చేశారు. తరగతుల వారీగా సబ్జెక్టులు, పరీక్ష తేదీలు, సమయాలతో కూడిన పూర్తి స్థాయి టైమ్‌టేబుల్ ఇప్పటికే పాఠశాలలకు అందుబాటులోకి వచ్చింది. విద్యార్థులు పరీక్షల షెడ్యూల్‌ను ముందుగానే పరిశీలించి, అందుకు అనుగుణంగా చదువులో ప్రణాళిక రూపొందించుకోవాలని విద్యాశాఖ సూచించింది.

# ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తా

### రేవంత్ రెడ్డి ఆరోపణలకు కవిత కౌంటర్

### గుంపు మేస్త్రీ, గుంటనక్క కలిసే ఉన్నారని కవిత విమర్శ

### ముఖ్యమంత్రిపై తమకు నమ్మకం లేదని వ్యాఖ్య

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ - గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.



# కన్నడ లెజెండ్ అనంత్ నాగ్‌కు 'దాదాసాహెబ్ ఫాల్కే' పురస్కారం

సీనియర్ నటుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అనంత్ నాగ్‌కు భారతీయ చలనచిత్ర రంగంలో అత్యున్నత పురస్కారమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024 సంవత్సరానికిగాను.. భారతీయ సినిమాకు ఆయన అందించిన విశేష సేవలను గుర్తిస్తూ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక చేసినట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) అధికారికంగా వెల్లడించింది. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ఎంపిక కమిటీ సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 22న గుజరాత్‌లోని కెవాడియాలో జరగనున్న 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవంలో అనంత్ నాగ్ ఈ అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా అనంత్ నాగ్‌కు అభినందనలు తెలిపారు. అద్భుతమైన నటన, వైవిధ్యమైన పాత్రలతో, ముఖ్యంగా కన్నడ చిత్రసీమలో ఆయన చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఈ గౌరవానికి ఆయన అన్ని విధాలా అర్హులని ప్రధాని పేర్కొన్నారు. 1948 సెప్టెంబర్ 4న జన్మించిన అనంత్ నాగ్ (అనంత్ నాగర్‌కట్టె) తన సుదీర్ఘ కెరీర్‌లో 300కు పైగా చిత్రాల్లో నటించారు. వీటిలో 250కి పైగా కన్నడ చిత్రాలే ఉన్నాయి. ఆయన కన్నడతో పాటు హిందీ, తెలుగు, తమిళం, మరాఠీ, మలయాళం, ఇంగ్లీష్ భాషల్లోనూ తన నటనతో ప్రేక్షకులను మెప్పించారు. వెండితెరపైనే కాకుండా, ఆర్.కె. నారాయణ్ కథల ఆధారంగా దూరదర్శన్‌లో ప్రసారమైన 'మాల్గుడి డేస్' సీరియల్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. తన నటనకుగాను ఐదుసార్లు కర్ణాటక రాష్ట్ర చలనచిత్ర పురస్కారాలు అందుకున్న అనంత్ నాగ్‌ను, గత ఏడాది (2025) భారత ప్రభుత్వం దేశంలోని మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్‌తో సత్కరించింది. దశాబ్దాలుగా భారతీయ సినిమాకు ఆయన చేస్తున్న సేవలకు ఫాల్కే అవార్డు సరైన గౌరవమని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

### కౌలు రైతులకు రుణాలు అందించేలా

# బ్యాంకులు ముందుకు రావాలి

మొదటి స్థానంలో నిలపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చంద్రబాబు తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే బ్యాంకులు పెద్దఎత్తున రుణాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కౌలు రైతులకు రుణాలు సమృద్ధిగా అందించేందుకు బ్యాంకులు సానుకూలంగా వ్యవహరించాలని సూచించారు. రైతులకు అవసరమైన ఆర్థిక సహకారం అందించడం ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు.

**రుణాల చెల్లింపుల్లో మహిళలదే అగ్రస్థానం**

రుణాల చెల్లింపుల విషయంలో ఆంధ్రప్రదేశ్ స్వయం సహాయక సంఘాల మహిళలు దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలిచారని సీఎం చంద్రబాబు తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంకులు మరింత సహకారం అందించాలని సూచించారు.

# 'మరి హరీశ్‌రావు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?'.. పొంగులేటి

రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనని అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఏ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని పొంగులేటి స్పష్టం చేశారు. ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

**22-ఏపై కీలక వివరాలు**

22-ఏ నిషేధిత జాబితాలోని భూములపై కూడా పొంగులేటి వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22-ఏ నిషేధిత జాబితా నుంచి 47,440 ఎకరాలను తొలగించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించామని చెప్పారు. 22-ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని పొంగులేటి వెల్లడించారు.

# భూ సమస్యల పరిష్కారానికి హైపవర్ కమిటీ

త్వరలో కొత్త విధానాన్ని ప్రవేశపెడతామని సీఎం తెలిపారు. ఈ విధానం పెండింగ్‌లో ఉన్న పాత దరఖాస్తులతో పాటు కొత్తగా వచ్చే దరఖాస్తులకూ వర్తిస్తుందని చెప్పారు. భూముల రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ ప్రక్రియలను సమాంతరంగా, ఏకకాలంలో చేపడతామని వెల్లడించారు.

**ఆమోదిత లేఅవుట్లలో ప్రభుత్వ భూములపై పరిష్కారం**

హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, డీటీసీపీ వంటి సంస్థల కాంపిటెంట్ అథారిటీలు ఆమోదించిన లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ దరఖాస్తులను పరిశీలించి తగిన పరిష్కారం చూపుతామని సీఎం తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి వారం రోజుల్లోగా సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని శాసనసభలో ప్రకటించారు.

# సంగారెడ్డిలో నిమజ్జనం వేళ ఆరుగురు విద్యార్థుల మృతి

శిరీష అనాథాశ్రమానికి చెందిన విద్యార్థులుగా గుర్తించారు. శిరీష అనాథాశ్రమానికి చెందిన విద్యార్థులు గణేశ్ విగ్రహ నిమజ్జనం కోసం నేరేడు చెరువు వద్దకు వెళ్లారు. నిమజ్జనం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు వారు ఒకరి తర్వాత ఒకరు నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పటాన్‌చెరు పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్ల సహాయంతో గాలించి విద్యార్థుల మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆసుపత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అనాథాశ్రమ నిర్వాహకులను పరామర్శించిన ఆయన, ఈ ఘటనపై తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతులను నర్సింహ రాజు, సుమంత్ (డిప్లొమా), గణేశ్ (డిప్లొమా), ఉదయ్ కిరణ్ (డిప్లొమా), శ్యామ్ కుమార్ (డిప్లొమా), సిద్ధార్థ్ (10వ తరగతి)గా గుర్తించారు. ఈ హృదయవిదారక ఘటనతో స్థానికంగా తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృతి చెందడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



### వచ్చేది మళ్లీ కాంగ్రెస్సే రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్‌ల మధ్య అత్యుత్తమ సమన్వయం: శ్రీధర్‌బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 16: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ల మధ్య అత్యుత్తమ పరిపాలనా, రాజకీయ సమన్వయం ఉందని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ప్రభుత్వ విజన్, పార్టీ నిర్మాణం ఒకే దిశలో సాగుతున్నాయని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో వీరిద్దరి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో తిరిగి విజయం సాధించి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో బీఆర్ఎస్ చర్చించాలని తాము భావించామని శ్రీధర్‌బాబు తెలిపారు. అయితే సభకు హాజరుకాకుండా ఉండాలనే వ్యూహంతోనే బీఆర్ఎస్ సభ్యులు కావాలని గందరగోళం సృష్టించి సస్పెన్షన్‌కు గురయ్యారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలకు శాసనసభ ప్రజాస్వామ్య నియమావళి, సభ నిర్వహణ నచ్చడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అసెంబ్లీ అతి తక్కువ రోజులు నడిచిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం పారదర్శకంగా, సుదీర్ఘంగా సభను నిర్వహిస్తుంటే బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేక సభ నుంచి వెళ్లిపోతున్నారని విమర్శించారు. సభాపతి స్థానాన్ని అవమానిస్తూ, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలిచేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని శ్రీధర్‌బాబు ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచే విధంగా ఆ పార్టీ వ్యవహరిస్తోందని ఆయన దుయ్యబట్టారు.

# సైబరాబాద్‌లో 11వ విడతలో 1,218 మొబైల్ ఫోన్ల పంపిణీ

## రూ.2.43 కోట్ల విలువైన ఫోన్ల రికవరీ.. బాధితుల్లో ఆనందం



సైబరాబాద్, సెప్టెంబర్ 16 ( వాయిస్ టుడే): సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆదేశాల మేరకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రజలు పోగొట్టుకున్న, దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోలీసులు రికవరీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా చేపట్టిన 11వ విడత రికవరీ కార్యక్రమంలో మొత్తం 1,218 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.2 కోట్ల 43 లక్షల 60 వేలుగా ఉంది. రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను సంబంధిత బాధితులకు పోలీసు అధికారులు స్వయంగా అందజేశారు. ఈ రికవరీ ప్రక్రియలో నేర పరిశోధన విభాగం కూకట్పల్లి పోలీసులు 410 మొబైల్ ఫోన్లు, నేర పరిశోధన విభాగం శేరిలింగంపల్లి పోలీసులు 407 మొబైల్ ఫోన్లు, నేర పరిశోధన విభాగం కుత్బుల్లాపూర్ పోలీసులు 401 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. మొత్తం 1,218 మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించారు.

ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ, ప్రజలు పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేస్తున్నామని తెలిపారు. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సులభంగా గుర్తించే అవకాశం ఉందని, ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే ఈ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో ఉపాధి, వ్యక్తిగత అవసరాలకు ఎంతో కీలకమైన సాధనంగా మారిందని, పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి యజమానులకు అందజేయడం ద్వారా వారిలో ఆనందాన్ని నింపడం పోలీసుల బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

అదేవిధంగా సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. ముఖ్యంగా ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, బెట్టింగ్ దరఖాస్తుల ద్వారా జరిగే మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు తమ సెల్‌ఫోన్ నంబర్లు, వ్యక్తిగత వివరాలను ఇవ్వకూడదని సూచించారు. మార్కెట్లు, బస్‌స్టాప్‌లు, ఉత్సవాలు జరిగే ప్రాంతాలు వంటి రద్దీ ప్రదేశాల్లో తమ విలువైన వస్తువులపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలని తెలిపారు. ఇళ్లలో దొంగతనాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దూర ప్రాంతాలకు లేదా విహారయాత్రలకు వెళ్లే సమయంలో తమ ఇళ్లకు సంబంధించిన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సామాజిక మాధ్యమాల్లో పంచుకోవద్దని సూచించారు. మొబైల్ ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన నేర పరిశోధన విభాగం బృందాలు, పోలీసు అధికారులు, సిబ్బందిని సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

మొబైల్ ఫోన్లు పోగొట్టుకుని తిరిగి పొందిన పలువురు బాధితులు తమ అనుభవాలను పంచుకున్నారు. కూకట్పల్లి ప్రాంతానికి చెందిన సృజన మాట్లాడుతూ, సుమారు రెండు నెలల క్రితం కూకట్పల్లిలోని టీ పాయింట్ వద్ద టీ తాగేందుకు వెళ్లిన సమయంలో తన ఐఫోన్ పదిహేడు ప్రో ఫోన్‌ను అక్కడే మర్చిపోయానని తెలిపారు. వెంటనే కూకట్పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశానని, ఫోన్‌కు ఎన్నిసార్లు కాల్ చేసినా స్విచ్‌ఆఫ్ రావడంతో తిరిగి దొరుకుతుందో లేదోనని ఆందోళన చెందానని చెప్పారు. అయితే సైబరాబాద్ పోలీసులు ప్రత్యేకంగా కృషి చేసి తన ఫోన్‌ను రికవరీ చేసి తిరిగి అందజేయడంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.




సమాచార సాంకేతిక సంస్థలో పనిచేస్తున్న నారాయణ చౌదరి మాట్లాడుతూ, కోకాపేట్‌లోని ఓ రెస్టారెంట్‌లో తన మోటరోలా మొబైల్ ఫోన్ పోయిందని తెలిపారు. అనంతరం నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, చాలా కాలం గడిచిపోవడంతో ఇక తన ఫోన్ దొరకదని భావించానని చెప్పారు. అయితే పోలీసులు అకస్మాత్తుగా ఫోన్ చేసి తన మొబైల్ దొరికిందని చెప్పడంతో ఎంతో ఆనందంగా అనిపించిందని తెలిపారు.

మెదక్‌కు చెందిన మహమ్మద్ ముఖిబ్ మాట్లాడుతూ, తాను కూకట్పల్లిలో ఆహార సరఫరా సంస్థల్లో పనిచేస్తున్న సమయంలో సుమారు ఏడాది క్రితం అల్పాబా హోటల్ వద్ద టీ తాగుతూ తన మొబైల్ ఫోన్‌ను అక్కడే మర్చిపోయానని తెలిపారు. కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చి చూడగా ఫోన్ కనిపించలేదని, వెంటనే ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చిందని చెప్పారు. ఆ సమయంలో తన వద్ద ఒక్క రూపాయి కూడా లేదని, తన తల్లి ఆరోగ్యం కూడా బాగాలేదని తెలిపారు. తన ఫోన్‌లో బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర ముఖ్యమైన సమాచారం ఉండటంతో వాటిని ఎవరైనా దుర్వినియోగం చేస్తారేమోనని భయపడ్డానని చెప్పారు. అయితే సైబరాబాద్ పోలీసులు కృషి చేసి తన ఫోన్‌ను రికవరీ చేసి తిరిగి అందజేయడంతో ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

బిహార్‌కు చెందిన మరో బాధితుడు సత్య నాలెడ్జ్ సిటీలో భద్రతా సిబ్బందిగా పనిచేస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తన మొబైల్ ఫోన్‌ను దొంగిలించారని తెలిపారు. అనంతరం రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేయగా, తన ఫోన్ తప్పకుండా దొరికేలా ప్రయత్నిస్తామని పోలీసులు ధైర్యం చెప్పారని పేర్కొన్నారు. కొంతకాలం తర్వాత నేర పరిశోధన విభాగం పోలీసులు ఫోన్ చేసి తన మొబైల్ దొరికిందని చెప్పడంతో ఎంతో ఆనందంగా అనిపించిందని, తన ఫోన్‌ను తిరిగి అందజేసిన సైబరాబాద్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రైమ్స్ డీసీపీ ఎ. ముత్యం రెడ్డి, క్రైమ్స్ ఏసీపీ వై. నాగేశ్వర్ రావు, ఎస్. వెంకటేష్, నేర పరిశోధన విభాగం కూకట్పల్లి ఇన్‌స్పెక్టర్ పి. జగదీశ్వర్, నేర పరిశోధన విభాగం కుత్బుల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ జి. సత్యనారాయణ, నేర పరిశోధన విభాగం శేరిలింగంపల్లి ఇన్‌స్పెక్టర్ ఎస్. విజయ్, నేర పరిశోధన విభాగం నార్సింగి ఇన్‌స్పెక్టర్ జి. మురళి కుమార్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి : ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 16(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో వివిధ ప్రాంతాలకు చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, మరియు తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు.. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు. పలు ప్రాంతాలలో జరగబోయే గణేశ్ ఉత్సవాల్లో పాల్గొనాలని పలువురు ఆహ్వానించారు.



## పద్మనగర్ ఫేజ్-1 తాగునీటి సమస్య పరిష్కరించాలి

### జలమండలి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ వినతి

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 16(వాయిస్ టుడే) కుత్బుల్లాపూర్: పద్మనగర్ ఫేజ్–1 కాలనీ వాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సోమవారం జలమండలి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ (ఐఏఎస్)ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. కాలనీలో మంచినీటి సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, నూతనంగా ఏర్పాటు చేయాల్సిన పైప్‌లైన్ పనులను వేగవంతం చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని జలమండలి అధికారిని కోరారు.ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## మైనారిటీ మహిళలకు రూ.50 వేల ఆర్థిక చేయూత

### ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కింద శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఐదుగురికి చెక్కుల పంపిణీ

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే): మైనారిటీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం కింద శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన ఐదుగురు అర్హులైన లబ్ధిదారులకు రూ.2.50 లక్షల విలువైన చెక్కులను పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పంపిణీ చేశారు. ఒక్కో లబ్ధిదారుకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళలు ఆర్థికంగా స్వశక్తితో ఎదిగేందుకు పలు పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. మైనారిటీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం అమలు చేస్తున్నట్లు గాంధీ తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన మహిళలకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఈ ఆర్థిక సహాయంతో మహిళలు చిన్నతరహా వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం కలుగుతుందని, తద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకోవడంతో పాటు స్వతంత్రంగా ఆదాయం పొందేందుకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. మైనారిటీ మహిళలకు ఆర్థికంగా అండగా నిలిచి వారి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, స్వయం ఉపాధి అవకాశాలను పెంచడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

రూ.50 వేల ఆర్థిక సహాయం అందుకోవడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. తమకు ఆర్థికంగా అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తుర్క కాశా మైనారిటీ వర్గానికి చెందిన వారికి రాళ్ల కోత పనుల కోసం జనరేటర్లు, పనిముట్ల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ తుర్క కాశా మైనారిటీ వర్గానికి చెందిన వారు రాళ్ల కోత పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గతంలో రాళ్లను కోయడానికి ఎక్కువ శ్రమ, సమయం అవసరమయ్యేదని, ఆదాయం కూడా తక్కువగా ఉండేదని చెప్పారు. జనరేటర్లు, పనిముట్ల కిట్లు అందుబాటులోకి రావడంతో సమయం ఆదా కావడంతో పాటు శ్రమ తగ్గి, తక్కువ సమయంలో ఎక్కువ పని చేసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. తద్వారా వారి ఆదాయం పెరిగి ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి ఈ పరికరాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, పోతుల రాజేందర్, కాశీనాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరించొద్దు

### వాస్తవాలను నేటి తరానికి తెలియజేయాలి: సీపీఐ నేత వీఎస్. బోస్

నాచారం (వాయిస్ టుడే): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను మతపరమైన కోణంలోకి వక్రీకరించడం, కమ్యూనిస్టుల పాత్రను విస్మరించడం చారిత్రక వాస్తవాలను వక్రీకరించడమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీఎస్. బోస్ అన్నారు. నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, అక్రమ పన్నులకు వ్యతిరేకంగా 1946--51 మధ్య సాగిన తెలంగాణ రైతాంగ పోరాటం ప్రజా ఉద్యమమని పేర్కొన్నారు. ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో సీపీఐ, ఏఐవైఎఫ్ ఉప్పల్ నియోజకవర్గ సమితుల ఆధ్వర్యంలో 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర--వక్రీకరణ--వాస్తవాలు' అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూమ్ మొహియుద్దీన్, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం తదితర కమ్యూనిస్టు నాయకులు పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. దొడ్డి కొమురయ్య అమరత్వం ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిందన్నారు. రైతుల భూములపై హక్కులు, వెట్టిచాకిరీ నిర్మూలన, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు సంఘటితమై పోరాడారని చెప్పారు. రైతాంగ సాయుధ పోరాటాన్ని కేవలం మతపరమైన ఘర్షణగా చూపడం చరిత్రకు అన్యాయమని బోస్ అన్నారు. రజాకార్ల దాడులు, నిజాం పాలనలోని అణచివేతలను చరిత్రలో నమోదు చేయడంతో పాటు ఉద్యమం సాగిన సామాజిక, ఆర్థిక నేపథ్యాన్ని కూడా ప్రజలకు తెలియజేయాలని కోరారు. కె.ఎల్. మహేంద్ర తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమంలో, ముఖ్యంగా హైదరాబాద్‌లో పార్టీ నిర్మాణం, కార్మిక సంఘాల అభివృద్ధిలో కీలకంగా పనిచేశారని గుర్తుచేశారు. చరిత్రను ఆధారాలతో అధ్యయనం చేసి వాస్తవాలను భవిష్యత్ తరాలకు అందించాలని విద్యార్థులు, యువతను కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి తోకల సత్యప్రసాద్, సీపీఐ ఉప్పల్ మండల సహాయ కార్యదర్శి ఎం.డి. బషీర్ అలీ, ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల సమితి కార్యదర్శి జి. మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు రిషిత, ఈ. సతీష్‌కుమార్, గిరిబాబు, ఎం. చంద్రశేఖర్, సీపీఐ సీనియర్ నాయకుడు రామ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## కొలన్ సులోచన మృతికి మైనాంపల్లి హన్మంత్ రావు సంతాపం

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 16(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి లిలికొలన్ హన్మంత్ రెడ్డి మాతృమూర్తి, కీ.శే. కొలన్ సులోచన ఈ నెల 9 వ తేదీన అకాల మరణం చెందడంతో, ఆయన నివాసానికి పలువురు ప్రముఖులు విచ్చేసి సంతాపం తెలిపారు ఈ సందర్భంగా లిమల్కాజగిరి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే మైనాంపల్లి హన్మంత్ రావు కొలన్ హన్మంత్ రెడ్డి పరామర్శించి, సులోచనమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు సులోచన మృతి పట్ల వారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారుఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## హమారా ప్రసాద్ పుస్తకంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 16(వాయిస్ టుడే ) జగద్గిరిగుట్ట : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను అవమానించేలా హర్ష ప్రసాద్ రచించినట్లు పేర్కొంటున్న కల్పత కథ' పుస్తకంపై చర్యలు తీసుకోవాలని జగద్గిరిగుట్ట దళిత బహుజన సంఘం పోలీసులను కోరింది. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పుస్తకంలోని అంశాలు దళిత, బహుజన వర్గాల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని సంఘం నాయకులు ఆరోపించారు. పుస్తకాన్ని విడుదల చేస్తే ప్రాంతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. పుస్తక విడుదలను నిలిపివేయడంతో పాటు, హర్ష ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. రాజ్యాంగ నిర్మాతపై అవమానకర వ్యాఖ్యలు చేయడం సమాజంలో ఉద్రిక్తతలకు దారితీయకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డి హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు యేసురత్నం, సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, ఎర్ర యాకన్న, దప్పు రామస్వామి, తొండ వెంకట్, ఎర్ర వీరన్న, చర్లపల్లి రాములు, హరినాథ్ రావు, కుమార్, గణేష్, నరేష్, బాబు, నరసింహ, హరినాథ్,కీర్తి,మాపల్లె శంకర్, ప్రమోద్, ప్రవీణ్,విజయ్, సంతోష్,జంబూ,వంశీ తదితరులు పాల్గొన్నారు.

## దుండిగల్ సర్కిల్ దొమ్మర పోచంపల్లి లోని అక్రమ నిర్మాణం పై సర్కిల్ అధికారుల చర్యలు

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 16(వాయిస్ టుడే): దుండిగల్ సర్కిల్ పరిధిలోని దొమ్మర పోచంపల్లి ప్లాట్ నెం. 22, సర్వేనెంబర్. 224/జు లో ూం2 పర్మిషన్ తీసుకొని ూ ం4 అనధికార అంతస్తులను అధికారులు కూల్చివేతలూ చేపట్టినారు ఈ సందర్భంగా దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ మాట్లాడుతూ... నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే ఏ నిర్మాణాన్ని కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిఘా తీవ్రతరం దుండిగల్ సర్కిల్ పరిధిలో తక్కువ గజాలలో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. నిబంధనల ఉల్లంఘనకు చెక్ అనుమతులు ఒకలా తీసుకొని, అదనంగా అనధికారిక నిర్మాణాలు (ఉన్నాయూతో రైజెడ్ కన్స్ట్రక్షన్స్ ) చేపడుతున్న వారిని గుర్తిస్తున్నట్లు తెలిపారు. భారీ కూల్చివేతలు ఖాయం ఇలాంటి అనధికార నిర్మాణాలను ఎప్పటికప్పుడు గుర్తించి, కఠిన చర్యలు తీసుకుంటూ డిమాలిషన్లు కొనసాగిస్తామని డిప్యూటీ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, మరియు టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## భువనగిరిలో శ్రీ బాలాజీ షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళ పల్లి శ్రీవాణి రవికుమార్

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. ( వాయిస్ టుడే ప్రతినిధి ):- భువనగిరి పట్టణంలో నూతనంగా శ్రీ బాలాజీ షాపింగ్ మాల్ ను భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ లు బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళ పల్లి శ్రీవాణి రవి కుమార్ మాట్లాడుతూ..భువనగిరి పట్టణం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. గతంలో నాణ్యమైన వస్త్రాలు..ఇతర వస్తువుల కోసం ప్రజలు హైదరాబాద్ వరకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు అలాంటి ఇబ్బంది లేదని, అన్ని రకాల బ్రాండెడ్ వస్త్రాలు, నూతన మోడల్స్ ఇక్కడే అందుబాటులోకి వచ్చాయని అన్నారు. ఈ షాపింగ్ మాల్ రావడం వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, అలాగే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరలోనే నాణ్యమైన వస్తువులు లభిస్తాయని తెలిపారు. వ్యాపారులు కూడా ప్రజలకు అందుబాటు ధరల్లో మెరుగైన సేవలు అందించాలని కోరారు. నూతన యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు తంగళ్లపల్లి రవికుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ, 18వ వార్డు కౌన్సిలర్ పాశం అమరేందర్, కాంగ్రెస్ నాయకులు కూర శివకుమార్, మహమ్మద్ రఫీ ఉద్దీన్, గౌరీ, గుమ్మడెల్లి రమేష్, రాజు, చౌదరి బ్రదర్స్ వస్త్ర యాజమాన్యం, స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సగర్వంగా జరుపుకోవడం అంటే మన పెద్దల్ని జ్ఞప్తికి తెచ్చుకోవడం



భారత దేశానికి స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చిందంటే 15 వ ఆగస్టు 1947 అని ఠక్కున చెప్పేస్తారు, కాని హైదరాబాద్ సంస్థానానికి స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చిందని అడిగితే మాత్రం నీళ్ళు నములుతారు నేటి యువత మరియు చాలా మంది చరిత్ర ఎరగని నేటి పౌరులు. ప్రక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఎంతో ఘనంగా ఈ రోజు జరుపుకుంటారు. కాని ఇక్కడ ఎందుకలా జరిగిందనేదానికి ఎన్నో కారణాలు అందులో ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు, అప్పటి ప్రభుత్వాలు, తదనాంతర ప్రభుత్వాలు ఓ కారణం. ఓటు రాజకీయాలు రాజకీయ లబ్దికోసం 17 సెప్టెంబర్ దినానికి ఉన్న విశిష్టతకు సరైన ప్రాముఖ్యాన్ని ఇవ్వకపోవడం. విమోచనం, విలీనం, విద్రోహం దినం అంటూ పార్టీ పాలకులు ఏ పేరుతో పిలిచినా జరిగిన పోరాటం స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం కోసం తెలంగాణ సపండ వర్గాలు, కుల, మతాలకు అతీతంగా తెలంగాణ మట్టి బిడ్డలు చేసిన పోరాట నగ్న సత్యాల, త్యాగాల చరిత్రను మనకు గుర్తుచేయడం.



## ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో వినాయకుడికి ప్రత్యేక పూజలు

### పాల్గొన్న బిజెపి నాయకులు

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి వేడుకలు రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి జి.శివాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ ఎస్ ప్రభాకర్, బీజేపీ సీనియర్ నాయకులు శామీర్ పేట ధర్మారెడ్డి,గౌరిగె కృష్ణ, మహంకాళి లక్ష్మన్, జి. శ్రీనివాస్ శర్మ, రావుల బాలకృష్ణ, రెడ్డి గారి దేవేందర్ రెడ్డి, సతీష్, కొల్లు బాలరాజు, డివిజన్ అధ్యక్షులు ఎం.పణీందర్, బోరంపేట మురళి, ప్రకాష్ గౌడ్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు ఆకుల రాకేష్, నామ శ్రవణ్ , రుషి కేష్, తదితరులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకటరామిరెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వి.తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సాగర్, ఉపాధ్యక్షులు కే.నరోత్తమరెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ డి.రాజు, సీనియర్ జర్నలిస్టులు పి.మహేందర్‌రెడ్డి, కె. చంద్ర మౌళి , ఎం. శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



# బాలాజీ జ్యువెల్లరీ షాపులో చోరీ కేసు ఛేదింపు

### నలుగురు నిందితుల అరెస్ట్.. 59.220 గ్రాముల బంగారు బార్, 2 కిలోల వెండి స్వాధీనం




చందానగర్, సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే): చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌతమినగర్‌లో శ్రీ బాలాజీ జ్యువెల్లర్స్‌లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. శ్రీ బాలాజీ జ్యువెల్లర్స్ యజమాని నూకల శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 01.08.2026న క్రైమ్ నంబర్ 829/2026 కింద బీయన్ఎస్ 331(4), 305 సెక్షన్లలో కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. 31.07.2026 అర్ధరాత్రి నుంచి 01.08.2026 మధ్య గుర్తుతెలియని వ్యక్తులు జ్యువెల్లరీ షాపు తాళాలు పగులగొట్టి, వెనుక గోడకు ఉన్న ఎగ్జాస్ట్ ఫ్యాన్‌ను తొలగించారు. అనంతరం గోడలోని రంధ్రాన్ని పెద్దదిగా చేసి షాపులోకి ప్రవేశించి, స్టోరేజ్ రూమ్ తాళాలను కూడా పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు.

కేసు దర్యాప్తులో భాగంగా చందానగర్ క్రైమ్ టీం, సీసీఎస్ టీంలు సుమారు 500 సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించారు. నిందితులు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడికి వెళ్లారు. అయితే, ఇదే సమయంలో మరో ఇంటి దొంగతనం కేసులో గ్వాలియర్ పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. అనంతరం చందానగర్ పోలీసులు పీటీ వారెంట్ల ద్వారా వారిని తమ కస్టడీలోకి తీసుకున్నారు. నిందితులను పోలీస్ కస్టడీలో విచారించగా, చోరీ చేసిన బంగారు, వెండి ఆభరణాలను A3 అతుల్ శర్మకు చెందిన మధ్యప్రదేశ్‌లోని భింద్ జిల్లా కథా గ్రామంలోని నివాసంలో దాచినట్లు వెల్లడించారు. వారి సమాచారంతో 13.09.2026న పోలీసులు మధ్యవర్తుల సమక్షంలో A3 నివాసంలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 59.220 గ్రాముల బరువున్న కరిగించిన బంగారు బార్‌తో పాటు సుమారు 2 కిలోల వెండి పట్టీలను స్వాధీనం చేసుకున్నారు. మరో కిలో వెండిని ఆశిష్ సోని అనే షాపు యజమానికి విక్రయించినట్లు నిందితులు వెల్లడించగా, అతని ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసులో ఎ1 ఛోటూ ఏ యోగేష్ మండేలియా (31), ఎ2 గోలు ఏ రాజేష్ మండేలియా (35), ఎ3 అతుల్ శర్మ (30), A4 శ్యామ్ సుందర్ కుష్వాహ్ (30)లను నిందితులుగా గుర్తించారు. వీరంతా మధ్యప్రదేశ్‌కు చెందినవారు కాగా, ఎ1, ఎ2లు గ్లాస్ ఫిట్టింగ్ పనులు, A4 డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితులను గ్వాలియర్ నుంచి చందానగర్‌కు తీసుకువచ్చి సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించిన అనంతరం బుధవారం న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఆర్‌సీ పురం డివిజన్ ఏసీపీ సీహెచ్. వై. శ్రీనివాస్ కుమార్ పర్యవేక్షణలో చందానగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు ఎ. శ్రీధర్ కుమార్, కె. ప్రదీప్ కుమార్, డిటెక్టివ్ క్రైమ్ సిబ్బంది, సీసీఎస్ టీం సమన్వయంతో కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో విశేష కృషి చేశారు. పోలీసు సిబ్బంది సేవలను ఉన్నతాధికారులు అభినందించి, తగిన రివార్డు అందజేయనున్నట్లు తెలిపారు.



## భువనగిరి పట్టణంలో 35వ వార్డులో వాటర్ పైప్ లైన్ పనులకు శ్రీకారం

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో (వాయిస్ టుడే ప్రతినిధి ):- భువనగిరి పట్టణంలోని 35వ వార్డులో చిరకాలంగా ఎదురుచూస్తున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. వార్డులో కొత్త వాటర్ పైప్ లైన్ పనులను మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ తంగళ్ల పల్లి శ్రీవాణి రవి కుమార్ మాట్లాడుతూ.. 35వ వార్డు ప్రజలు తాగునీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా మహిళలు నీటి కోసం దూరం వెళ్లాల్సి వస్తోందని తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే కొత్త పైప్ లైన్ మంజూరు చేయించామన్నారు.ఈ కొత్త పైప్ లైన్ తో వార్డులోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని, త్వరితగతిన పనులు పూర్తి చేసి నీటి సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. భువనగిరి పట్టణ అభివృద్ధే తమ లక్ష్యమని, ప్రతి వార్డులో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు తంగళ్లపల్లి రవికుమార్, 18వ వార్డు కౌన్సిలర్ పాశం అమరేందర్, స్థానిక నాయకులు నజీర్, కుమార్, సతీష్, రాజు, కాంగ్రెస్ నాయకులు కూర శివకుమార్, మహమ్మద్ రఫీ ఉద్దీన్, గౌరీ, గుమ్మడెల్లి రమేష్, వార్డు మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## రాయగిరిలో ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న టీపీసీసీ సభ్యులు తంగళ్లపల్లి రవికుమార్

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో ( వాయిస్ టుడే ప్రతినిధి ):- భువనగిరి పట్టణంలోని రాయగిరిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక గణపతి పూజా కార్యక్రమానికి టీపీసీసీ సభ్యులు తంగళ్లపల్లి రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యులు తంగాళ్ళ పల్లి రవి కుమార్ మాట్లాడుతూ.. గణపతి నవరాత్రి ఉత్సవాలు కేవలం మతపరమైన వేడుకలు మాత్రమే కాకుండా ప్రజలందరినీ ఒకే చోట చేర్చి ఐక్యతను చాటుతాయన్నారు. రాయగిరి యాదవ సంఘం యువత ఇంత ఘనంగా ఉత్సవాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. విఘ్నాలను తొలగించే వినాయకుని ఆశీస్సులతో భువనగిరి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని, పట్టణం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వాహకులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకులు అవుశెట్టి పాండు, యాదవ్ రాజు, సతీష్, మహేష్, యాదవ సంఘం పెద్దలు, స్థానిక యూత్ సభ్యులు, వార్డు ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 48,630 మందికి ఫుడ్ సెక్యూరిటీ కార్డుల పంపిణీ



జూబ్లీహిల్స్: 16 సెప్టెంబర్ (వాయిస్ టుడే ) : తెలంగాణ ప్రభుత్వం తరఫున ఫుడ్ సెక్యూరిటీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని కార్మిక నగర్ డివిజన్‌లోని హెచ్ఎఫ్ నగర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ఆదేశాల మేరకు ఐదు డివిజన్లకు చెందిన ప్రజలకు ఫుడ్ సెక్యూరిటీ కార్డులను పంపిణీ చేశారు. మొత్తం 48,630 మంది లబ్ధిదారులకు కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక నగర్ అధ్యక్షులు పుస అండలమ్మ.. ఎస్సీ సెల్ రహేమత్ నగర్ అధ్యక్షులు విజయ్ కుమార్.. ఎస్సీ సెల్ కార్మిక నగర్ ప్రెసిడెంట్. చిట్కుల. రవి ..అధికారులు విక్రమ్, సాయితో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## రైల్వేకు పోటీగా.. మాల్స్ దీటుగా టీజిఎస్ ఆర్టీసీ సంచలన నిర్ణయం

**13 ప్రాంతాల్లో హైటెక్ మోడల్ బస్టాండ్లు..**

**షాపింగ్, ఫుడ్ కోర్టులు, వినోద సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ ట్రాన్సిట్ సిస్టమ్**

సికింద్రాబాద్, సెప్టెంబర్ 17 (వాయిస్ టుడే ప్రతినిధి): కాలానుగుణంగా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 13 ప్రాంతాల్లో ఆధునిక హంగులతో హైటెక్ మోడల్ బస్ స్టేషన్లను నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. 'ఇంటిగ్రేటెడ్ ట్రాన్సిట్ సిస్టమ్' విధానంలో నిర్మించనున్న ఈ బస్టాండ్లను ఇతర రవాణా వ్యవస్థలతో అనుసంధానం చేయడంతో పాటు ప్రయాణికులకు ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురానున్నారు. బస్టాండ్లలో షాపింగ్, బిజినెస్ కాంప్లెక్స్‌లు, ఫుడ్ కోర్టులు, వినోద సదుపాయాలు తదితర వసతులు కల్పించనున్నారు. ఈ హైటెక్ బస్టాండ్లలో వాణిజ్య స్థలాలను కేటాయించేందుకు ఆసక్తి ఉన్న వ్యాపారులు ఆర్టీసీ యాజమాన్యాన్ని సంప్రదించవచ్చని సంస్థ తెలిపింది. బస్టాండ్లు ఏర్పాటు కానున్న ప్రాంతాలు: నాగర్‌కర్నూల్, రేగొండ, హుజూర్‌నగర్, కోదాడ, కొడంగల్, కోస్గి, మద్దూరు, కేసముద్రం, హుస్నాబాద్, ములుగు, మధిర, నల్గొండ, కొత్తగూడెం. ఈ మోడల్ బస్ స్టేషన్లతో ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలతో పాటు షాపింగ్, ఆహారం, వినోదం వంటి సదుపాయాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి రానున్నాయని టీజీఎస్‌ఆర్టీసీ తెలిపింది. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొంది.

## చైతన్య పాఠశాలలో ఘనంగా క్రీడా దినోత్సవం

హైదరాబాద్: 16 సెప్టెంబర్ (వాయిస్ టుడే ): శ్రీ చైతన్య పాఠశాలలో క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, ఆరోగ్యంపై అవగాహన, క్రమశిక్షణతో పాటు జట్టుగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశంతో వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. పరుగుపందెం, రిలే, లాంగ్‌జంప్, షాట్‌పుట్, తాడులాగుడు తదితర పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని, చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
గురువారం 17 సెప్టెంబరు 2026

# సమాఖ్య 2026 బిజినెస్ సమ్మిట్‌కు సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం




హైదరాబాద్: 'సమాఖ్య 2026 బిజినెస్ సమ్మిట్'కు హాజరుకావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని నిర్వాహకులు ఆహ్వానించారు. అక్టోబర్ 14, 15 తేదీల్లో హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో సమాఖ్య 2026 బిజినెస్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సమ్మిట్‌కు అధికారికంగా ఆహ్వానం అందజేశారు.



ప్రమోటర్లు టీవీఎన్ రావు, పీవీ రావు, జస్టిస్ జి. భవానీ ప్రసాద్, పోతురెడ్డి రమేష్, కె. శ్రీహరి, డా. పీఎల్ఎన్ పటేల్ తదితరులు సమ్మిట్ నిర్వహణకు సంబంధించిన వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే 'సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్' గ్రాండ్ లాంచ్ కార్యక్రమం గురించి కూడా సీఎంకు వివరించి, కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ భేటీలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కరీంనగర్ లైబ్రరీ కమిటీ చైర్మన్ సత్తు మల్లేశ్, ప్రమోటర్లు టీవీఎన్ రావు, పీవీ రావు, జస్టిస్ జి. భవానీ ప్రసాద్, పోతురెడ్డి రమేష్, కె. శ్రీహరి, డా. పీఎల్ఎన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. అక్టోబర్ 14--15 తేదీల్లో హైటెక్స్‌లో జరగనున్న ఈ బిజినెస్ సమ్మిట్‌లో వ్యాపార, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చలు జరగనున్నాయి.

## తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ వద్దిరాజు

### కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలి: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



హైదరాబాద్, సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే): తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 1948 సెప్టెంబర్ 17న 'ఆపరేషన్ పోలో' అనంతరం నిజాం పాలన భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని ఆయన గుర్తుచేశారు. కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో 14 ఏళ్లపాటు సాగిన ఉద్యమం ఫలితంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిందని రవిచంద్ర పేర్కొన్నారు. ప్రజల సంపూర్ణ మద్దతుతో కేసీఆర్ తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని ఆయన అన్నారు. చారిత్రక ఘట్టానికి గుర్తుగా కేసీఆర్ సెప్టెంబర్ 17ను 'తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం'గా ప్రకటించి అధికారికంగా పలు కార్యక్రమాలు నిర్వహించారని రవిచంద్ర తెలిపారు. నిజాం పాలన ముగిసి ప్రజలకు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం లభించిన రోజుగా సెప్టెంబర్ 17కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పాలనపై విమర్శలు చేస్తూ తెలంగాణలో స్వేచ్ఛ హరించుకుపోయిందని, ప్రజాస్వామ్యం అపహాస్యమవుతోందని ఎంపీ రవిచంద్ర ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తిరిగి గాడిలో పడాలంటే కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా రావాల్సిన అవసరం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. విలీన దినోత్సవం సందర్భంగా తెలంగాణలోని ప్రజలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో, ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న తెలంగాణ బిడ్డలందరికీ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శుభాకాంక్షలు తెలిపారు.



## ఓజోన్‌ను రక్షిద్దాం -మానవాళినీ సంరక్షిద్దాం

### పర్యావరణవేత్త రతన్ సింగ్ ఠాగూర్

వరంగల్ ( వాయిస్ టుడే ) సెప్టెంబర్ 16 : ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా యూత్ పర్ సొసైటీ ఆధ్వర్యంలో ఓజోన్ యొక్క ప్రాముఖ్యత పై ప్రజలకు అవగాహన కార్యక్రమన్ని బుధవారం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ రతన్ సింగ్ ఠాగూర్ ముఖ్యఅతిథిగా హాజరై నారు. కార్యక్రమం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఓజోన్ పొర యొక్క ఆవశ్యకత అలాగే దాని క్షీణతతో కలిగే నష్టాలను వారికీ వివరించారు. అలాగే యూత్ ఫర్ సొసైటీ వ్యవస్థాపకుడు కొడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓజోన్ అన్నది వర్షం మరియు ఎండ నుండి గొడుగు ఎలాగైతే మనల్ని కాపాడుతుందో అదే విధంగా సూర్యుని నుండి వచ్చే అతినీల రహిత కిరణాలను నుండి సంభవించే దుష్పరి నామాలు (చర్మ వ్యాధులు క్యాన్సరు ఇతర రకాల రోగాల నుండి) కాపాడుతుందని, ఇది ముఖ్యంగా సి ఎఫ్ సి ద్వారా ఇతర పర్యావరణ కాలుష్యం ద్వారా ఓజోన్ పొర పల్చబడడం లేదా హోలు కావడమో జరుగుతుందని దీనివల్ల మానవాళికి, జీవరాశులకి ఎంతో ముప్పు ఏర్పడుతుందని కావున ప్రతి ఒక్కరూ, ఇకనుండి అయిన కాలుష్యాన్ని తగ్గించి చెట్లను పెంచి ప్రకృతిని కాపాడాలని తద్వారా ఓజోన్ పొర నుండి మనల్ని సంరక్షించి కోవాలని మరియు భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలని ఈ సందర్భంగా వాలంటీర్లను కోరారు. ముఖ్యంగా వాలంటీర్స్ వీటిపై ప్రజలకు అవగాహన కలిగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా కన్స్యూమర్ ఆర్గనైజేషన్ బాధ్యులు విజయరావు, రాజు, యూత్ ఫర్ సొసైటీ బాధ్యులు దేవిశ్రీప్రసాద్, రాజకుమార్, వాలంటీర్లు ఉమాదేవి ,లక్కీ, రక్షిత, సభ ,మలిహా, సూచిత, సహస్ర తదితరులు పాల్గొన్నారు.

## పిసిసి అధ్యక్షుడు నీ సీనియర్ నాయకులు ఆర్ సురేందర్ రెడ్డినీ మర్యాద పూర్వకంగా కలసిన మాజీ మంత్రి,ఏమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య



వరంగల్ ( వాయిస్ టుడే ) సెప్టెంబర్ 16 : తెలంగాణ పిసిసి అధ్యక్షులుగా రెండు సంవత్సరాల కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని పి సి సి అధ్యక్షులు మహేష్ గౌడ్ ను మాజీ మంత్రి ఏ మ్మెల్సీ బస్వా రాజు సారయ్య బుధవారం నాడు మర్యాద పూర్వకంగా కలసి ఆయన కు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వరంగల్ పార్లమెంట్ మాజీ సభ్యులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు రామ సహాయం సురేందర్ రెడ్డి నీ హైదరాబాదులోని వారి స్వగృహంలో మహేష్ కుమార్ గౌడ్ తో కలసి ఏ మ్మెల్సీ సారయ్య కలవడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ యం పి సురేందర్ రెడ్డి మహేష్ కుమార్ గౌడ్ ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేసినారు. అనంతరం ప్రస్తుత రాష్ట్ర రాజకీయాల పై వారు చర్చించారు.



## కిషోర బాలికలు పోషకాహారం తీసుకోవాలి

తొర్రూరు, సెప్టెంబర్ 16 వాయిస్ టుడే : కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలని ఏసిడిపిఓ విజయలక్ష్మి అన్నారు. పోషణ మాసం సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారం తొర్రూరు డివిజన్ పరిధిలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.రక్తహీనత, పోషకాహారం,బాలికల భద్రత, ఐసిడిఎస్ సేవలపై నెల్లికుదురు సెక్టార్ సూపర్వైజర్ నార్లపురం సరిత అవగాహన కల్పించారు. ఏసిడిపిఓ మాట్లాడుతూ... రక్తహీనత రాకుండా కిషోర బాలికలు ప్రతి ఒక్కరూ సమతుల ఆహారం తీసుకోవాలని తెలిపారు. పోషకాలతో కూడిన ఆహారం, పరిశుభ్రత, ఆరోగ్యకర జీవనశైలి పెంపొందించుకోవాలని కోరారు. రోజువారి మెనూలో గుడ్లు, ఆకుకూరలు,పాలు, చిరుధాన్యాలు,పండ్లు భాగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమలత, అంగన్వాడి టీచర్ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## నిజాంల నిరంకుశ పాలన నియంతృత్వానికి మారుపేరు: డాక్టర్ సమత

### ఆపరేషన్ పోలోతోనే హైదరాబాద్ సంస్థానానికి విముక్తి

### నాటి పోరాట చరిత్రను పాలకులు మరుగున పరుస్తున్నారు: బీజేపీ ఆగ్రహం



హైదరాబాద్, సెప్టెంబర్ 16: నాటి హైదరాబాద్ సంస్థానంలో నిజాంల పాలన నియంతృత్వానికి, అరాచకాలకు మారుపేరుగా సాగిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సమత విమర్శించారు. రజాకార్ల అకృత్యాలకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటాల ఫలితంగానే హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా బర్కత్ పుర లో ఆమె మాట్లాడుతూ... దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చి యావత్ భారతావని సంబరాలు చేసుకుంటుంటే, హైదరాబాద్ సంస్థానం మాత్రం నిజాంల చేతిలో బందీగా ఉండి స్వేచ్ఛ కోసం పోరాడాల్సి రావడం అత్యంత దురదృష్టకరమన్నారు. నిజాం అండతో ఖాసిం రజ్వీ ఆధ్వర్యంలోని రజాకార్లు సాగించిన మారణకాండకు భైరాన్‌పల్లి, పరకాల, వెయ్యి ఊడల మర్రి వంటి ప్రాంతాలు ఇప్పటికీ సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని గుర్తుచేశారు. నాటి కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ దృఢ సంకల్పంతో చేపట్టిన 'ఆపరేషన్ పోలో' సైనిక చర్య సెప్టెంబర్ 13న ప్రారంభమై, సెప్టెంబర్ 17న నిజాం మెడలు వంచిందని, దీంతో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని వివరించారు. నాటి సంస్థానంలో తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకలోని పలు ప్రాంతాలు ఉండేవని, ఈ ప్రాంత ప్రజలు చేసిన వీరోచిత పోరాటాలను, అమరుల త్యాగాలను గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజకీయ లబ్ధి కోసం మరుగున పడేస్తున్నాయని ఆరోపించారు. నిజాం అరాచకాలను ఎదిరించి దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, కాళోజీ నారాయణరావు, కొమురం భీమ్, రావి నారాయణరెడ్డి, సర్దార్ సర్వాయి పాపన్న వంటి ఎందరో యోధులు ప్రాణాలర్పించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. సెప్టెంబర్ 17 అనేది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ దినమని, నాటి నిరంకుశ పాలన, అమరవీరుల త్యాగాల గురించి భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డాక్టర్ సమత స్పష్టం చేశారు.



## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించింది సిపిఐ

### హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశం లో విలీనం చేయడంలో సిపిఐదే కీలక పాత్ర

### సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి

తొర్రూరు, సెప్టెంబర్ 16 వాయిస్ టుడే : నాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించి హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడంలో వేలాది మందిని బలి ఇచ్చి పోరాటం సలిపిన ఘనత సిపిఐదే అని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి అన్నారు. బుధవారం తొర్రూర్ మండలంలోని వెంకటాపురం లోని మొగుళ్ల మల్లయ్య, హరిపిరాలలో వల్లప్ కొమురెల్లి, తొర్రూరు పట్టణంలో మన్నూరు వెంకటయ్య, అమ్మపురంలో తమ్మెర వెంకట్ రామ్ నరసయ్య, పబ్బొస్ వీరభద్రయ్య, గూడేల్లి ఎల్లయ్య, జలగం సోమయ్య,తంగిరాల ప్రసాదరావు, గాదరబోయిన కొమురయ్య, బొల్లం వెంకయ్య పంజాల రామస్వామి,కొత్తూరు నరసయ్య, డొంక రాములు మూడు రాంరెడ్డి, గుంటుక ఐలయ్య, కొలిపాక సోమన్న స్తూపాలకు పూలమాల వేసి మరియు వారి యొక్క కుటుంబాలను సన్మానించుకోవడం జరిగింది. అనంతరం బి విజయ సారథి మాట్లాడుతూ 4000 మందిని బలి ఇచ్చి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించిన నిజమైన వారసులు సిపిఐ శ్రేణులే అన్నారు తెలంగాణ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశంలో చేర్చాలని డిమాండ్ చేశారు బిజెపి తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందువుల ముస్లింల గొడవలెక్క సృష్టిస్తుందన్నారు తెలంగాణ సాయుధ పోరాటానికి బిజెపికి సంబంధం లేదు అన్నారు ఈ తొర్రూరు ప్రాంతంలో వందలాదిమంది ఉద్యమంలో పాల్గొని మరణించారని తెలిపారు కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు తమ్మెర విశ్వేశ్వరరావు ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓమా బిక్షపతి, సిపిఐ తొర్రూర్ మండల కార్యదర్శి బందు మహేందర్, సహాయ కార్యదర్శిలు గణపురం లక్ష్మణ్,పేరబోయిన కిరణ్ కుమార్ శాఖ కార్యదర్శి బూరుగు యాదగిరి, వల్లపు వెంకన్న,పట్టణ కార్యదర్శి ముద్దరబోయిన వెంకన్న, నాయకులు వార్డు సభ్యులు యాకయ్య, కోటగిరి యాకాంతం, కృష్ణ, బొల్లు శీను, మంగళ పెల్లి బిక్షపతి, కిషన్, పంజాల పాపయ్య, నక్కిరెడ్డి సమ్మిరెడ్డి, యాకయ్య, వెంకన్న, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మానేరు తీరంలో నిమజ్జన వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితె



సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే): వినాయక విగ్రహాల నిమజ్జనానికి సిరిసిల్ల లోని మానేరు తీరంలోని బ్రిడ్జి వద్ద చేస్తున్న ఏర్పాట్ల ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, పలు శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, వినాయక మండపాల నిర్వాహ కులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించా లని సూచించారు. ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలని కోరారు.అన్ని శాఖల అధికారులు సమన్వయం తో ముందుకు వెళ్ళి, వేడుకలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. వినాయక నిమజ్జనా నికి కావలసిన నీటి సౌకర్యం, స్టేజ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, వైద్య సేవలు, అగ్ని మాపక శాఖ అధికారులు సేవలు అందించా లని పారిశుధ్య పనులు చేయించాలని,క్రేన్లు అందుబాటు లో పెట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇక్కడ మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీ నాగేంద్రా చారి, నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.




## కవులు, కళాకారుల పుట్టిల్లు కరీంనగర్

### 'మధుపాలీస్ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్' పుస్తకం అద్భుతం

### మోదీ చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావాలి: బండి సంజయ్

కరీంనగర్, సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే): కవులు, కళాకారులకు కరీంనగర్ పుట్టినిల్లుగా నిలుస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న తనకు కరీంనగర్‌లో ఉన్నంత మంది కవులు, కళాకారులు మరెక్కడా కనిపించలేదని పేర్కొన్నారు. సమాజానికి సేవ చేస్తున్న ఇలాంటి వ్యక్తుల మధ్య ఎంపీగా, మంత్రిగా కొనసాగడం తన అదృష్టమన్నారు. మంకమ్మతోటలోని సాయి మానేరు స్కూల్‌లో కవి, రచయిత, ఎస్సారార్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి రచించిన 'మధుపాలీస్ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్' పుస్తకాన్ని బండి సంజయ్ ఆవిష్కరించారు. సమకాలీన జాతీయ, అంతర్జాతీయ అంశాలపై రాసిన వ్యాసాలతో రూపొందిన ఈ 400 పేజీల పుస్తకం విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సేవలు, రాజకీయ ప్రస్థానంపై తెలుగులో సమగ్ర పుస్తకాన్ని తీసుకురావాలని మధుసూదన్‌రెడ్డిని బండి సంజయ్ కోరారు. మోదీ జీవితానికి సంబంధించిన అనేక అంశాలను పుస్తక రూపంలో తెలుగు ప్రజలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా 'ఆశీర్వాద దీపం' కార్యక్రమం నిర్వహించాలని, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారు ఒక్కో దీపం వెలిగించాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్, బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, మానేరు స్కూల్స్ అధినేత అనంతరెడ్డి, టీబీఎస్ఎస్ అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి పాల్గొన్నారు.

# పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్యే





**ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం**

**విద్యార్థుల ఆకలిని తరిమి అక్షరానికి అండగా నిలవడమే ధ్యేయం**

**రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**కరీంనగర్‌లో రూ.8 కోట్లతో భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం**

**49,025 మంది విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం**

కరీంనగర్,సెప్టెంబర్ 16(వాయిస్ టుడే): పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు ఉదయం ఆకలితో తరగతి గదులకు రాకుండా వారికి నాణ్యమైన,పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించి ఆకలిని తరిమి అక్షరానికి అండగా నిలవడమే స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. కరీంనగర్ మార్కెట్‌యార్డులో తెలంగాణ ప్రభుత్వం,హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా కలిసి సుమారు రూ.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్,ఎమ్మెల్యే గంగుల కమలాకర్,జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ప్రారంభించారు.అనంతరం కిచెన్‌లో ఏర్పాటు చేసిన అధునాతన సాంకేతిక పరికరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో విద్యార్థుల ఎదుగుదలకు భూములు,నిధులు వంటి ఆస్తులు ఉండేవని,ఇప్పుడు పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని అన్నారు. ఇటీవల జరిగిన సిప్ సర్వేలో ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబాలను పరిశీలించినప్పుడు ఉన్నత చదువులు చదివిన కుటుంబాలే మెరుగైన స్థాయిలో ఉన్నట్లు గుర్తించిన విషయాన్ని ప్రస్తావించారు.అందుకే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచుతున్నామని, ఇప్పుడు విద్యార్థులకు ఉదయమే నాణ్యమైన అల్పాహారం అందించే కార్యక్రమాన్ని కూడా చేపట్టామని మంత్రి తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి తల్లిదండ్రులు మద్దతు ఇవ్వాలని కోరారు.ఆకలితో ఉన్న పిల్లవాడు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేడని మంత్రి అన్నారు. విద్యార్థులకు ఉదయమే పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఏకాగ్రత,జ్ఞానాత్మక సామర్థ్యం,తరగతి గది భాగస్వామ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.విద్యార్థుల హాజరు, సమయపాలన,విద్యా పనితీరు మెరుగుపడేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. పేద,మధ్యతరగతి కుటుంబాలకు, ముఖ్యంగా ఉదయమే ఉపాధి కోసం వెళ్లే తల్లిదండ్రులకు ఈ కార్యక్రమం ఆర్థికంగా, సమయపరంగా ఉపశమనం కల్పిస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు వంట,ఆహార నిర్వహణ బాధ్యతల నుంచి విముక్తి పొంది బోధనపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కరీంనగర్‌లో సుమారు రూ.8 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సెంట్రలైజ్డ్ కిచెన్‌కు రోజుకు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే సామర్థ్యం ఉందని మంత్రి తెలిపారు.17 మండలాల్లోని 669 ప్రభుత్వ పాఠశాలలు,11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఈ బ్రేక్‌ఫాస్ట్ సేవలు అందుతాయని చెప్పారు.మొత్తం 49,025 మంది విద్యార్థులు ప్రతిరోజూ ప్రయోజనం పొందుతారని వివరించారు. కరీంనగర్,హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల విద్యార్థులకు ఈ కిచెన్ ద్వారా అల్పాహారం అందుతుందని తెలిపారు. నియోజక వర్గాల వారీగా హుస్నాబాద్‌లో 16,544 మంది, మానకొండూర్‌లో 8,645 మంది, చొప్పదండిలో 7,481 మంది, కరీంనగర్‌లో 16,355 మంది విద్యార్థులు లబ్ధి పొందుతారని చెప్పారు.రాష్ట్రంలో ఇది ఆరవ కమ్యూనిటీ కిచెన్ అని మంత్రి తెలిపారు.ఇక్కడి నుంచి 17 మండలాల్లో దాదాపు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ జరుగుతుందని చెప్పారు. కిచెన్‌లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇడ్లీ,దోశ,పూరీ, బోండా,సాంబార్ తయారు చేసే మిషన్లు ఏర్పాటు చేశారని మంత్రి తెలిపారు.పాత్రలు శుభ్రం చేసే మిషన్లు,పాల కేంద్రం,ఆహార పదార్థాల టెస్టింగ్ ల్యాబ్, కూరగాయలు కట్ చేసే మిషన్లు, కూరగాయలు కడిగే మిషన్లు,చట్నీ పౌడర్ తయారీ మిషన్లు కూడా ఏర్పాటు చేశారని చెప్పారు.వాటి పనితీరును స్వయంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే విధమైన నాణ్యతతో,పరిశుభ్రంగా అల్పాహారం అందించడమే కేంద్రీకృత వంటశాలల ఉద్దేశమని మంత్రి తెలిపారు.ఆహార భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ ×ూా స్థాయి ప్రమాణాలను పాటించేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. థర్మల్ ఇన్సులేటెడ్ వాహనాల ద్వారా పాఠశాలలకు సకాలంలో అల్పాహారం తరలిస్తామని తెలిపారు. విద్యార్థులకు ఇష్టమైన, సాధారణంగా ఇళ్లలో తినే ఆహార పదార్థాలతో మెనూ రూపొందించామని,మెనూ రూపకల్పనలో చీ×చీ సహకారం తీసుకున్నామని చెప్పారు. సోమవారం ఇడ్లీ--సాంబార్, మంగళవారం పూరీ--ఆలూ కుర్మా, బుధవారం దోశ--చట్నీ,గురువారం ఉప్మా--చట్నీ,శుక్రవారం మిల్లెట్ ఇడ్లీ--సాంబార్,శనివారం బోండా చట్నీ అందిస్తామని మంత్రి వివరించారు.రోజు విడిచి రోజు విద్యార్థులకు పాలు కూడా అందిస్తామని తెలిపారు.2024 డిసెంబర్‌లో కొడంగల్‌లో స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని మంత్రి తెలిపారు.అక్కడ విద్యార్థుల హాజరు 75 శాతం నుంచి 90 శాతానికి పెరిగినట్లు గుర్తించామని చెప్పారు.విద్యార్థుల్లో ఏకాగ్రత,తరగతి గది భాగస్వామ్యం,సమయపాలన మెరుగుపడినట్లు,ఆలస్యంగా పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య తగ్గినట్లు తెలిపారు. కొడంగల్‌లో అత్యుత్తమ ఫలితాలతో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాన్ని విస్తరిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,72,291 మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించేలా స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని విస్తరించే ప్రతిపాదనలు ఉన్నాయని మంత్రి తెలిపారు. 23,106 ప్రభుత్వ పాఠశాలలను కార్యక్రమం పరిధిలోకి తీసుకురానున్నామని చెప్పారు.31 జిల్లాల్లో 31 కేంద్రీకృత మెగా/కమ్యూనిటీ కిచెన్లు ఏర్పాటు చేసే ప్రణాళిక ఉందని,వీటి కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.245 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు తెలిపారు.అల్పాహారం పంపిణీకి సుమారు 1,400 వాహనాలు, 5,000 మంది సిబ్బంది అవసరమవుతారని చెప్పారు. కేంద్రీకృత వంటశాలల ద్వారా సుమారు 15,000 ప్రత్యక్ష,10,000 పరోక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు.స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమంలో ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తున్న హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ప్రపంచవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం సిఎస్ఆర్ నిధుల కింద సంస్థకు సహకరిస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించే కార్యక్రమంలో భాగస్వామిగా నిలిచినందుకు తెలంగాణ ప్రభుత్వం తరఫున ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు.గతంలో తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో ఇదే ఫౌండేషన్ ద్వారా కరీంనగర్‌లో ఆలయం నిర్మించాలని అనుకున్నామని,ఆ అంశం ప్రస్తుతం పెండింగ్‌లో ఉందని చెప్పారు.మళ్లీ ఫౌండేషన్‌తో కలిసి ఆ దిశగా ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ క్యాంటీన్లను కూడా హరే కృష్ణ మూవ్‌మెంట్ నిర్వహిస్తోందని పేర్కొన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి విజిలెన్స్ విచారణ పూర్తయిందని, కళాశాలలకు రావాల్సిన బకాయిలను విడుదల చేస్తున్నామని మంత్రి తెలిపారు. సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్,మాజీ మంత్రి గంగుల కమలాకర్ విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించి వారితో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. అనంతరం కిచెన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి వాటి పనితీరు,ఆహార తయారీ, పరిశుభ్రత,నాణ్యత ప్రమాణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా,అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే,మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్,హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కౌంటియా దాస స్వామీజీ, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న,ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్,కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




## సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలి

**మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి**

**డీఈఓకు ఏఐటీయూసీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ వినతి**

సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే): సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేసి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించా లని తెలంగాణ మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యం లో జిల్లా విద్యాశాఖ అధికారికి బుధవారం వినతి పత్రం అందజేశారు.2023-24 సంవత్స రాలకు సంబంధించిన అల్పాహారం పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, అలాగే 2023, 2024 సంవత్సరాలకు సంబంధించిన 9 నెలల పెండింగ్ బిల్లులను చెల్లించాలని యూనియన్ నాయకులు కోరారు. అల్పాహారానికి సంబంధించిన విధి విధానాలను ప్రకటించాలని, గ్యాస్‌తో సహా మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన సరుకులను ప్రభుత్వమే సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యా సంవత్సరానికి సంబంధించిన అల్పాహార మధ్యాహ్న భోజన కార్మికుల బకాయిలను వెంటనే చెల్లించాలి.ప్రతి విద్యార్థికి మెస్ చార్జీ రూ.25 చెల్లించా లని డిమాండ్ చేశారు.కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు కోరారు.

## హుజూరాబాద్ అభివృద్ధి ప్రదాత స్వర్గీయ వొడితల రాజేశ్వర్ రావు : వొడితల ప్రణవ్



హుజూరాబాద్ సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే): హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన మహోన్నత వ్యక్తి మాజీ రాజ్యసభ సభ్యుడు స్వర్గీయ వొడితల రాజేశ్వర్ రావు అని, ఆయన చూపిన బాటలోనే నడుస్తూ ప్రజలకు మరింత సేవ అందిస్తామని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వొడితల ప్రణవ్ పేర్కొన్నారు. బుధవారం రోజున రాజేశ్వర్ రావు జయంతిని పురస్కరించుకుని హుజూరాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కూడా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ, రాజేశ్వర్ రావు చేసిన అభివృద్ధి పనులే ఇప్పటికీ నియోజకవర్గంలో సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని, ఆయన దూరదృష్టి వల్ల ఆ సేవలు ఇప్పటి తరానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని గుర్తుచేసుకున్నారు. రాజకీయాలకు అతీతంగా అభిమానులు, కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్న ఈ వేడుకల్లో పలువురు నాయకులు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు , కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్



జమ్మికుంట సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే): జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ సేవా పథకం (చీూూ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ముఖ్య అతిథిగా పాల్గొని, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు , విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవాళి మనుగడకు మొక్కలే ఆధారమని నొక్కి చెప్పారు. "అమ్మ జన్మనిస్తే, చెట్టు పునర్జన్మనిస్తుంది"అని పేర్కొంటూ, ప్రస్తుతం పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు తమ తమ నివాస ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో తప్పనిసరిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. తద్వారా సొంత ఆరోగ్యంతో పాటు సమాజ ఆరోగ్య భద్రతకు దోహదపడిన వారవుతారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్, అధ్యాపకులు ఓదెలు కుమార్, గణేష్, రాజేందర్, రవీందర్లతో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయురాలికి ఘన సన్మానం

తొర్రూరు, సెప్టెంబర్ 16 వాయిస్ టుడే : తొర్రూరు రెవెన్యూ డివిజన్ కేంద్రం అంబేద్కర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఇటీవల లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పురస్కారం పొందిన పాఠశాల సహ ఉపాధ్యాయురాలు వేముల సంధ్యారాణిని ప్రధాన ఉపాధ్యాయురాలు స్వాతి మరియు సహ ఉపాధ్యాయులు సరిత, సునిత,ప్రవీణ్ కుమార్ శిరీష,యమన,సతీష్ తదితరులు ఆమెను శాలువా,పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు.



## 24 గంటల్లో హత్య కేసును ఛేదించిన జమ్మికుంట పోలీసులు

**భూ వివాదం నేపథ్యంలో రాజబాబు హత్య.. నిందితుల అరెస్ట్**

**చాకచక్యంగా దర్యాప్తు చేసిన జమ్మికుంట పోలీసులు**

జమ్మికుంట, సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే): భూ వివాదం నేపథ్యంలో తనుగుల గ్రామానికి చెందిన బొజ్జపల్లి రాజబాబు హత్యకు గురైన కేసును జమ్మికుంట పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. పట్టణ సీఐ శ్రీ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణ ప్రకారం.. రాజబాబు తన తల్లి లచ్చమ్మకు చెందిన భూమి విషయంలో కుటుంబ సభ్యులతో తరచూ గొడవపడేవాడు. భూమిని విక్రయించాలన్న విషయంలో విభేదాలు తలెత్తడంతో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి భూమిని మూడు వాటాలుగా పంచాలని నిర్ణయించినప్పటికీ రాజబాబు అంగీకరించలేదని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 10న మద్యం సేవించిన రాజబాబు తన బావ జూపాక శంకర్ ఇంటికి వెళ్లి తల్లి లచ్చమ్మ, అక్క కవితతో గొడవకు దిగినట్లు విచారణలో వెల్లడైంది. ఘర్షణ సమయంలో శంకర్‌తో పాటు వెంకటేష్, రాజయ్య, సతీష్ తదితరులు రాజబాబును కొట్టి మంచానికి కట్టివేశారని, అనంతరం శంకర్ చున్నీతో మెడ బిగించడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

మృతదేహాన్ని దాచిపెట్టేందుకు నిందితులు దుప్పటిలో చుట్టి సైకిల్‌పై గ్రామ శివారులోని పొలానికి తరలించి, గుంతలో పూడ్చిపెట్టినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పూడ్చేందుకు ఉపయోగించిన పార, గడ్డపార, తరలింపునకు ఉపయోగించిన సైకిల్, మెడ బిగించేందుకు ఉపయోగించిన చున్నీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భూ, కుటుంబ లేదా వ్యక్తిగత వివాదాలను చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీస్‌స్టేషన్ లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించి చట్టపరంగా పరిష్కరించుకోవాలని జమ్మికుంట పోలీసులు ప్రజలకు సూచించారు.



## సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలి

**అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ జిల్లా ప్రతినిధులు**

సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే): సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికం గా "తెలంగాణ విమోచన దినోత్సవం"గా నిర్వహిం చాలని కోరుతూ బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధులు జిల్లా అడిషనల్ కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ తెలంగాణ విమోచన కమిటీ ఆధ్వర్యం లో "తెలంగాణ సత్య సంకల్పాలు" పేరు తో ఏడు డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.నిజాం పాలన లోని హైదరాబాద్ సంస్థానం భారతదేశం లో విలీనమైన చారిత్రక సందర్భానికి ఈ రోజు గుర్తు గా నిలుస్తుందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ పరిణామానికి ముందు జరిగిన పోరాటంలో రైతులు,మేధావులు, యువకులు సహా పలువురు ప్రాణత్యాగాలు చేశారని తెలిపారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా "తెలంగాణ విమోచన దినోత్సవం"గా నిర్వహించాలి.సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ డిమాండ్లను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపించారు.ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు సిరికొండ శ్రీనివాస్, పొన్నాల తిరుపతిరెడ్డి, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దూమాల శ్రీకాంత్, వెంకటాపూర్ సర్పంచ్ మేడిశెట్టి బాలయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల తిరుపతి, చందుర్తి మాజీ ఉపసర్పంచ్ చిర్రం తిరుపతి, బీజేపీ సీనియర్ నాయకులు మంద రాజేందర్, మల్లారం తిరుపతి, వంశీ, రేగుల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ ఆత్మ గౌరవ సింహగర్జన విజయవంతం చేయాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ముదిరాజ్ సంక్షేమ సంఘం పిలుపు**

సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే): మూడు సంవత్సరాలు గడుస్తున్న ముదిరాజులకు ఇచ్చిన హామీ లను అమలు చేయలేదని ముదిరాజు లను బీసీ డి నుండి ఏ లోకి మార్చాలని ప్రభుత్వాన్ని ముదిరాజులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ముదిరాజు లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చొక్కాల రాము ముదిరాజ్ ఆధ్వర్యం లో సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించి ఈ నెల 28 వ తేదీన సిరిసిల్ల అంబేద్కర్ చౌక్ లో చేపట్టే ముదిరాజ్ ఆత్మ గౌరవ సింహగర్జన కార్యక్రమ వివరాలను వెల్లడించారు. అనంతరం డిఎస్పి నాగేంద్ర చారి, పట్టణ సీఐ శ్రీనివాస్ లను కలిసి ముదిరాజ్ ఆత్మగౌరవ సింహ గర్జన కార్యక్రమానికి అనుమతుల కోసం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం లో ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, కోడి అంతయ్య, పర్ష హనుమండ్లు, వంకాయల కార్తీక్, చొప్పరి రామచంద్రం, పర్షరాములు, రాయిని ప్రతాప్,పసుల తిరుపతి, కొనరావుపేట సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు దేవరాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల జర్నలిస్టు ఫోరం జిల్లా కో కన్వీనర్‌గా దాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

**- నియామక పత్రాన్ని అందజేసిన రాష్ట్ర కార్యదర్శి కర్ణ బ్రహ్మానందరెడ్డి**

**- ఈనెల 27న యాదాద్రిలో ఘనంగా 9వ ఆవిర్భావ వేడుకలు**



హైదరాబాద్ /నాగార్జునసాగర్ సెప్టెంబర్ 16 వాయిస్ టుడే: తెలంగాణ ఉద్యమకారుల జర్నలిస్టు ఫోరం జిల్లా కో కన్వీనర్‌గా దాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. బుధవారం నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి కర్ణ బ్రహ్మానంద రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు,ఈ సందర్భంగా కర్ణ బ్రహ్మానందరెడ్డి స్వయంగా దాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేసి అభినందించారు,అనంతరం రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ, ఈనెల 27న ఆదివారం ఉదయం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం వద్ద లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు,రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే ఈ వేడుకలకు రాష్ట్రంలోని ఉద్యమకారు లు అధిక సంఖ్యలో హాజరై విజయవం తం చేయాలని వారు పిలుపునిచ్చారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమ కారులు చేసిన పోరాటాలు,త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు.జిల్లా కన్వీనర్‌గా తనను ఎన్నుకున్న రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాసరావుకు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్య,డాక్టర్ తోట నరసింహ చారి దక్షిణ తెలంగాణ ఇంచార్జ్,రాష్ట్ర కార్యదర్శి నియోజకవర్గం ఇంచార్జ్ కర్ణ బ్రహ్మానందరెడ్డి,జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్,మరియు తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి దాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు,ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిరికొండ మధు, ప్రధాన కార్యదర్శి తలారి యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెంగలి జంగయ్య,జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్ ముదిరాజ్,కార్యదర్శి కట్టబోయిన చంద్రయ్య,మండలి అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాస్,కార్యదర్శి ఊరే శ్రీనివాస్,పంతులు రవిబాబు జిల్లా కార్యదర్శి,మున్సిపాలిటీ టౌన్ అధ్యక్షుడు మంగళగిరి వెంకోజి,ప్రధాన కార్యదర్శి కాటు కృష్ణ,జర్నలిస్టుల ఫోరం ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ దినేష్ నాయక్,ఉపాధ్యక్షులు చందు నాయక్,అనుముల మండల అధ్యక్షులు మాస బోయిన వెంకటేశ్వర్లు,జర్నలిస్టు ఫోరం నాగార్జునసాగర్ నియోజకవర్గ కన్వీనర్ కోడ అప్పారావు,తదితరులు పాల్గొన్నారు.



## 15వ వార్డులో గణేష్ మండపాల్లో చైర్మన్ పుల్కం రాజు ప్రత్యేక పూజలు

వేములవాడ/ రాజన్న సిరిసిల్ల జిల్లా (వాయిస్ టుడే ప్రతినిధి) : వేములవాడ పట్టణంలోని 15వ వార్డులో పలు యూత్ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను లివేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజులి సందర్శించి, గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలకు శాంతి, సౌభాగ్యం, ఐశ్వర్యం కలగాలని కోరుకున్నారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించుకోవాలని యూత్ సభ్యులకు, ప్రజలకు సూచించారు. గణేష్ ఉత్సవాలు యూత్ సభ్యుల మధ్య ఐక్యత, స్నేహభావాన్ని మరింత పెంపొందించేలా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా 15వ వార్డు ప్రజలకు, వేములవాడ పట్టణ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో యూత్ సభ్యులు, గణేష్ మండపాల నిర్వాహకులు, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రి ఆరోగ్యశ్రీ పథకంలో కొంత నిధులు దుర్వినియోగం






శ్రీకాళహస్తి (వాయిస్ టుడే) సెప్టెంబర్ 16: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రి నందు దుర్వినియోగమైన నిధులపై శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా సూపర్డెంట్ మురళీకృష్ణ టూ టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా, టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ నాగరాజు విచారణ చేపట్టారు .ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ మురళీకృష్ణ మాట్లాడుతూ శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు ఆరోగ్యశ్రీ పథకంలో కొంత నిధులు దుర్వినియోగం పాలయాయని ,తమకు తెలియడంతో వెలువెంటనే సమాచారాన్ని తమ శాఖ ఉన్నతాధికారులకు, మరియు టూ టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా, టూ టౌన్ పోలీసులు విచారణ చేపట్టారని ఈ సందర్భంగా తెలియజేశారు .టూ టౌన్ సీఐ నాగరాజు మాట్లాడుతూ.. శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి నందు ఆరోగ్యశ్రీ పథకంలో 42లక్షల రూపాయలు దుర్వినియోగం అయ్యాయని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ మురళీకృష్ణ ఫిర్యాదు చేయడంతో ,విచారణ చేపట్టామని విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలియజేస్తామని తెలియజేశారు, ఈ నిధులు దుర్వినియోగం అవడంలో శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు విధులు నిర్వహించే జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీ ప్రసన్న పోస్టుమార్టం డిపార్ట్మెంట్లో పనిచేసే చందు, అనుమానితులుగా ఉన్నారని తెలియజేశారు ,వారిపై విచారణ జరుగుతున్నామని త్వరలోనే పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.



## వినాయక చవితి వేడుకలు

శ్రీకాళహస్తి(వాయిస్ టుడే)సెప్టెంబర్ 16: శ్రీకాళహస్తిలోని బహదూర్ కరిమరిఅమ్మ ఆలయం వద్ద నందువినాయక చవితి వేడుకలు పురస్కరించుకొని శ్రీకాళహస్తిలోని బహుదూర్ పేట నందుఎం బాలసుబ్రహ్మణ్యం భక్త బృందం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక చవితి వేడుకలు పురస్కరించుకొనివినాయక చవితి వేడుకలను అత్యంత వేడుకగా నిర్వహించుకున్నారుమూడవ రోజునతెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగావిఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి దూపదీప నైవేద్యాలు సమర్పించారుఅనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారుటిడిపి రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్య మాట్లాడుతూ.. శ్రీకాళహస్తిలోని బహదూర్పేట నందు కరీమారమ్మ దేవాలయం వద్ద బాలసుబ్రహ్మణ్యంభక్త బృందం ఆధ్వర్యంలో క్రిష్ణ గణపతిని కొలువు తీర్చి మూడు రోజులు గణపతి వేడుకలు అత్యంత వేడుకగా నిర్వహించాలని తెలియజేశారు, నేడు మూడవ రోజున పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి సాయంత్రం నిమర్జనం కార్యక్రమం ఉంటుందని, ఈ నిమర్జనం కార్యక్రమంలో యావన్మంది భక్తులు పాల్గొని స్వామివారి కృప పొందవలసిందిగా తెలియజేశారు ఈ క్రిష్ణగణపతి చల్లని దీవెనలు కూటమి ప్రభుత్వంకు ఉండాలన్నారు, కూటమిప్రభుత్వంలో నేడు ప్రజలు సుఖ సంతోషాలతో సౌభాగ్యాలతో సంక్షేమ పథకాలతో సుభిక్షంగా ఉండాలని తెలియజేశారు రానున్నపంచాయతీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయ దుందుభి మోగిస్తుందని సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలు, జయ ,జయంతు, గున్ని, మున్నా, వీరేష్ , లయ ,జ్యోతి,సూర్య తదితరులు పాల్గొన్నారు.

## బి ఎల్ ఆర్ ఈశ్వర బంధం ద్వారా 100 మందికి భోజనాల ఏర్పాటు

మాడుగులపల్లి సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే ) : నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామానికి చెందిన వడ్డేపల్లి లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం సాయంత్రం 5 గంటలకు మృతి చెందారు. ఆమె మృతిచెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి చొరవ తీసుకుని, అంత్యక్రియలకు హాజరైన బంధుమిత్రుల కోసం బీఎల్ఆర్ ఈశ్వర బంధం ద్వారా సుమారు 100 మందికి భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాడుగులపల్లి మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఒంటెపాక వినయ్ బంధుమిత్రులకు భోజనం వడ్డించారు. మృతురాలి కుటుంబానికి పలువురు సానుభూతి తెలిపారు.



## ఈనెల 18, 19వ తేదీల్లో నల్లగొండలో జర్నలిస్టుల దీక్షలను విజయవంతం చేయండి

**నల్లగొండ నగర జర్నలిస్టులంతా దీక్షలలో భాగస్వాములు కావాలి**

**ఇంటి స్థలాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కదలిరండి**

**ఈ 30 ఏళ్ల పోరాటంలో విజయమే లక్ష్యంగా కలిసి నడుద్దాం**

**టీయూడబ్ల్యూజే ( ఐజేయు) జిల్లా కమిటీ పిలుపు**

నల్లగొండ, సెప్టెంబర్ 16( వాయిస్ టుడే జిల్లా ప్రతినిధి): టీయూడబ్ల్యూజే(ఐజేయు) ఆధ్వర్యంలో ఈనెల 18,19వ తేదీల్లో నల్లగొండ కలెక్టరేట్ ఎదుట జరిగే జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత 30 సంవత్సరాలుగా నల్లగొండ లో పనిచేసే జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వకపోవడంతో జర్నలిస్టులు తీవ్ర నిరాశ నిస్పృహలతో ఉన్నారని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి చెందిన జర్నలిస్టులు ఇంటి స్థలంతో పాటు ఇల్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నల్లగొండ నగరంలో పనిచేస్తున్న జర్నలిస్టుల బాధలను ప్రభుత్వం ఇప్పటికైనా అర్థం చేసుకొని ఇంటి స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 18,19వ తేదీల్లో రెండు రోజులపాటు జరిగే రిలే నిరాహార దీక్షలో నల్లగొండ పట్టణంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఫోటో జర్నలిస్టులు, వీడియో జర్నలిస్టులు, చిన్న పత్రికల జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. 18వ తేదీన ప్రతిపక్ష పార్టీల నాయకులు దీక్షలకు సంఘీభావం తెలియజేస్తారని, 19వ తేదీన దీక్షా శిబిరాన్ని అధికార పార్టీ నేతలు ప్రజాప్రతిని సందర్శించి మద్దతు పలకనున్నారని తెలిపారు. నల్లగొండలో జరిగే దీక్షలకు జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున వచ్చి సంఘీభావం తెలియజేయాలని కోరారు.



## నూతన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

శ్రీకాళహస్తి(వాయిస్ టుడే)సెప్టెంబర్ 16: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో, నేడు తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన పలు నూతన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దివ్య చేతుల మీదుగా ఈ అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తిరుమలకు విచ్చేసే సామాన్య భక్తులకు మరింత మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి తో కలిసి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే వెంకట సుధీర్ రెడ్డి మంత్రులు, సహచర శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు టిటిడి బోర్డు మెంబర్లు మరియు టీటీడీ ఉన్నతాధికారులతో కలిసి పాల్గొనడం జరిగింది.ఏడుకొండలవాడి సేవలో, ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుంది.

## వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

**- మున్సిపల్ చైర్మన్ రవీందర్, కమిషనర్ మనోహర్ గౌడ్, ఎస్సై సుధీర్ రావు**



రాయికల్( వాయిస్ టుడే): వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు రాయికల్ పట్టణంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. నిమజ్జన ప్రదేశంలో చేపట్టిన ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ రవీందర్, కమిషనర్ మనోహర్ గౌడ్, ఎస్సై సుధీర్ రావు పరిశీలించారు. నిమజ్జన మార్గం, నిమజ్జన ప్రదేశం, భక్తుల రాకపోకలు, భద్రతా చర్యలను పరిశీలించి ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. నిమజ్జనం సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్, భద్రత, ప్రజల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

ఇట్టి సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనం ఆధ్యాత్మిక, శాంతియుత వాతావరణంలో సజావుగా జరిగేలా మున్సిపల్, పోలీసు శాఖల సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

## జామా మసీద్ ఇమామ్ ఇమాముద్దీన్ సాహెబ్ మృతి



రాయికల్, ( వాయిస్ టుడే): రాయికల్ పట్టణంలోని జామా మసీద్ ఇమామ్ జనాబ్ ఇమాముద్దీన్ సాహెబ్ ఆకస్మికంగా మృతి చెందారు. మంగళవారం అసర్ నమాజ్ నిర్వహిస్తున్న సమయంలో ఆయనకు గుండెపోటు రావడంతో మసీదులోనే తుదిశ్వాస విడిచినట్లు సమాచారం. ఆయన ఆకస్మిక మృతితో రాయికల్ పట్టణంలోని ముస్లిం సమాజంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇమాముద్దీన్ సాహెబ్ జామా మసీద్ ఇమామ్‌గా చాలాకాలంగా సేవలందిస్తూ, మతపరమైన కార్యక్రమాల్లో ప్రజలకు మార్గదర్శకత్వం అందించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, మసీదు కమిటీ సభ్యులు, స్థానిక ముస్లిం సమాజ ప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## ఎస్ జి ఎఫ్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఆకునూరు విద్యార్థులు

సైదాపూర్ (వాయిస్ టుడే) : మండలంలోని ఆకునూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈనెల 7 నుండి 9 వరకు జరిగిన మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 16 నుండి 19 వరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొట్ల రామస్వామి తెలిపారు జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను బుధవారం ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రామస్వామి మాట్లాడుతూ వాలీబాల్ సీనియర్ బాలికల విభాగంలో ఏడుగురు జూనియర్ విభాగంలో నలుగురు వాలీబాల్ సీనియర్ బాలుర విభాగంలో ముగ్గురు జూనియర్ విభాగంలో ముగ్గురు మొత్తం 17 మంది విద్యార్థులు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. అలాగే ఖో ఖో నలుగురు విద్యార్థులు ఎంపికయ్యా రని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు బొట్ల రామస్వామి పిడి నిర్మల ఉపాధ్యాయులు హన్మండ్ల భాస్కర్ సమ్మయ్య సుధాకర్ హరియా నాయక్ చిరంజీవి అనిత తదితరులు పాల్గొన్నారు. వాలీబాల్ బాలికల సీనియర్ విభాగంలో ఎర్రల రక్షిత నెల్లి ప్రణతి నెల్లి శ్వేత కాటిక సిరి బొడిగే రక్షిత గుర్రం అర్చన రాయిశెట్టి అవంతి లు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వాలీబాల్ బాలికల జూనియర్ విభాగంలో శిరవేణి సంకీర్తన మ్యాదరి హాసిని ఎండి అప్సాన బత్తుల కృపారాణి ఎంపికయ్యారు. వాలీబాల్ సీనియర్ బాలుర విభాగంలో పెండోట సూర్యతేజ సోతుకు సాయి ఆశిష్ గుర్రం ప్రణీత్ జూనియర్ విభాగంలో జేల్లా శివ బొజ్జ నిశాంత్ పెండొట వరుణ్ తేజాలు ఎంపికయ్యారు. ఖో ఖోలో నెల్లి అను బత్తుల అనుశ్రీ గొట్టే నిత్య గుర్రం ఆరాధ్య లు ఎందుకు అయ్యారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**